RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:128

బుధవారం
మే 13, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

## జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

- పేదల సొంతింటి కల సాకారం
- నియోజకవర్గాల వారీగా స్థలాల గుర్తింపు
- ప్రజాప్రతినిధులతో మంత్రి పొంగులేటి సమీక్ష



2లో

## బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు!



- పోక్సో కేసులో విచారణకు హాజరు కావాలని ఆదేశం
- పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచన
- దర్యాప్తు వేగవంతం చేసిన ప్రత్యేక బృందం
- రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసిన కేసు
- బాధితురాలి వివరాలు గోప్యంగా ఉంచి విచారణ
- సాక్ష్యాలు, ఫోన్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

2లో



# బతుకు భారంగా..

### రానున్న రోజుల్లో ధరల ఎఫెక్ట్ సామాన్యుడిని ముంచెత్తనుందా
### హైదరాబాద్ వేదికగా ప్రధాని 'ముందస్తు జాగ్రత్త' పిలుపు

- గడ్డు పరిస్థితులకు సంకేతమనే భయం
- దేశ వ్యాప్తంగా మొదలైన చర్చ
- రానున్న రోజుల్లో మరింత మండిపోనున్న చమురు
- అంతర్జాతీయ మార్కెట్లో 50% పెరిగిన ముడిచమురు
- ఇంధన పొదుపు, ప్రజా రవాణా, వర్క్ ఫ్రమ్ హోమ్..
- భారతీయుల జీవనశైలి మారబోతుందా?
- గల్ఫ్ యుద్ధ మేఘాలు, ట్రంప్ నిర్ణయాలతో సామాన్యులపై తీవ్ర ప్రభావం
- ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్న ఆర్థిక నిపుణులు

2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

మధ్యప్రాచ్య యుద్ధ మేఘాలు భారతీయ సామాన్యుడి వంటింట్లో మంటలు రేపుతున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు రికార్డు స్థాయికి చేరడం, దేశీయ చమురు సంస్థలు లక్ష కోట్ల నష్టాల్లో కూరుకుపోవడంతో భారత్‌లో ధరల సునామీ ముంచుకొచ్చేలా కనిపిస్తోంది. ఇటీవల హైదరాబాద్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు ఈ పెను ప్రమాదానికి ముందస్తు హెచ్చరికగా నిలుస్తున్నాయి. చమురు కంపెనీలను దివాళా తీయకుండా కాపాడాలంటే లీటర్ పెట్రోల్, డీజిల్‌పై భారీగా ధరలు పెంచడం మినహా ప్రభుత్వానికి మరో మార్గం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఇంధన భారంతో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకి మధ్య తరగతి బడ్జెట్ అతలాకుతలం కానుండటంతో, ప్రజలు ఇప్పుడే పొదుపు బాట పట్టాలని ప్రభుత్వం సూచిస్తోంది.



## కవితకు కోర్టు సమన్లు

- కామారెడ్డి రైల్‌రోకో కేసులో హాజరుకావాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌తో నిర్వహించిన ఆందోళనపై కేసు నమోదు

2లో

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో కామారెడ్డిలో నిర్వహించిన రైల్‌రోకో కార్యక్రమం వ్యవహారం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేయగా,

మిగతా 2వ పేజీలో

## రెండోసారి సీఎంగా హిమంత

**అస్సాంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం**

**మోదీ సహా పలువురు ప్రముఖుల హాజరు**



2లో

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం

**నీట్ పేపర్ లీక్ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టాలి**

**కేంద్రంపై కేటీఆర్ ఆగ్రహం**

2లో



## ప్రజలకు మరింత చేరువ కావాలి



### గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలి

- రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే క్యాడర్ ను సిద్ధం చేయాలి
- బీఆర్ఎస్‌లో సంస్థాగత మార్పులపై కీలక చర్చ
- ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన విస్తృత సమావేశం
- పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కీలక సమావేశం జరిగింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, సంస్థాగత బలోపేతం వంటి అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కేసీఆర్ నేతలకు వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేలా సంస్థాగత మార్పులు చేపట్టాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో పాటు జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, అంతర్గత కమిటీల ఏర్పాటు వంటి అంశాలు సమావేశంలో ప్రధాన చర్చగా మారాయి. ప్రజల్లో పార్టీకి మరింత చేరువ కల్పించేందుకు బూత్ స్థాయి నుంచి కార్యాచరణ బలోపేతం

మిగతా 2వ పేజీలో

## మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు నరహరి లొంగుబాటు



- తెలంగాణ పోలీసుల ఎదుట సరెండర్
- భార్యతో కలిసి స్వచ్ఛందంగా లొంగిపోయిన అగ్రనేత
- సరండా అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న భారీ కూంబింగ్
- మిసిర్ బెస్రా కోసం భద్రతా బలగాల గాలింపు ముమ్మరం
- మూడు దశాబ్దాలుగా అజ్ఞాత జీవితం గడిపిన నరహరి
- గణపతి, మిసిర్ బెస్రాలకు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు
- ఆపరేషన్ కగార్ ఒత్తిడితో లొంగుబాటు?
- మావోయిస్టు వ్యూహాత్మక చర్యల్లో కీలక పాత్ర పోషించిన నేత

2లో

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ఉండొద్దు



- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించను
- మిషన్ మోడ్‌లో సేకరణ పూర్తి చేయాలి
- గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- కొనుగోలు చేసిన వెంటనే గోదాములకు తరలించాలి
- తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడాలి
- తేడా వస్తే కఠిన చర్యలు..
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, ప్రతి అంశాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని, ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

బుధవారం | మే 13, 2026

## బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు!

**వేద న్యూస్, హైదరాబాద్**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు పోక్సో కేసు దర్యాప్తులో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో నమోదైన కేసులో విచారణకు హాజరుకావాలని అధికారులు ఆదేశించారు. మధ్యాహ్నం 2 గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణలో పాల్గొనాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రాధాన్యత సంతరించుకోగా, విచారణను పారదర్శకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే డీజీపీకి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి కేసును లోతుగా విచారిస్తున్నారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, అనంతరం దర్యాప్తు బాధ్యతలను సిట్‌కు అప్పగించారు. ఇదిలా ఉండగా, తనను హనీట్రాప్ చేశారని ఆరోపిస్తూ బండి భగీరథ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తనపై ఉద్దేశపూర్వకంగా కుట్ర జరుగుతోందని, తప్పుడు ఆరోపణలతో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో కేసు మరింత సంచలనంగా మారింది. ఒకవైపు బాధితురాలి కుటుంబం న్యాయం కోరుతుండగా, మరోవైపు బండి భగీరథ్ తనపై కుట్ర జరుగుతోందని చెబుతుండటంతో కేసుపై ఉత్కంఠ నెలకొంది. రాజకీయ వర్గాల్లో కూడా ఈ వ్యవహారంపై చర్చ కొనసాగుతోంది. కేసును రాజకీయ కోణంలో కాకుండా చట్టపరంగా విచారించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మైనర్ బాలికకు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. బాధితురాలి వివరాలను గోప్యంగా ఉంచుతూ చట్ట ప్రకారం విచారణ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి రేపు జరగనున్న విచారణపైనే ఉంది. సిట్ అధికారులు బండి భగీరథ్ నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## ప్రజలకు మరింత చేరువ కావాలి

**మొదటి పేజీ తరువాయి**

చేయాలని నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్యాడర్‌ను సమన్వయం చేసే దిశగా వ్యూహాలు సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళికపై కూడా నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో కేటీఆర్‌తో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ముఖ్య నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, శ్రవణ్ కుమార్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పార్టీని ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లాల్సిన అవసరాన్ని కేసీఆర్ సమావేశంలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని, జిల్లా పర్యటనల ద్వారా పార్టీ క్యాడర్‌తో నేరుగా మమేకం కావాలని సూచించినట్లు సమాచారం. ప్రజా సమస్యలపై ఉద్యమాత్మకంగా ముందుకు వెళ్లడంతో పాటు ప్రభుత్వ విధానాలపై బలమైన స్వరం వినిపించాలని నేతలకు దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ పునర్వ్యవస్థీకరణ ద్వారా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ నాయకత్వం ముందుకు సాగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

**మొదటి పేజీ తరువాయి**

గోదాములకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ధాన్యం రవాణాలో జాప్యం జరిగితే రైతులు నష్టపోతారని పేర్కొన్న ముఖ్యమంత్రి, ఒప్పందం ప్రకారం వాహనాలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికీ వెనకాడొద్దని స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదులు అందించాలని, తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో గోదాముల కొరత ఉన్నట్లు సమాచారం వస్తోందని, అలాంటి చోట్ల తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను వినియోగించి ధాన్యాన్ని నిల్వ చేయాలని తెలిపారు. పరిస్థితులను బట్టి ధాన్యాన్ని అక్కడి నుంచి గోదాములకు తరలించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట పోలీసుల సహకారం తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి ఐకేపీ కేంద్రం, ప్రతి రైస్‌మిల్లు వద్ద ఒక బాధ్యతాయుత అధికారిని నియమించాలని ఆదేశించారు. అకాల వర్షాల సమయంలో రైతులకు నష్టం జరగకుండా శాశ్వత ప్రణాళికలు సిద్ధం చేయాలని కూడా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు చేరవేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కల్వకుంట్ల కవితకు కోర్టు సమన్లు

**మొదటి పేజీ తరువాయి**

ఈ కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్‌లోని ద్వితీయ న్యాయ మేజిస్ట్రేట్ ప్రథమ శ్రేణి కోర్టు ఆమెకు సమన్లు జారీ చేసింది. రేపు ఉదయం పది గంటల ముప్పై నిమిషాలకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది. కామారెడ్డిలో ఇటీవల నిర్వహించిన రైల్‌రోకో కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే పట్టాలపై ఆందోళన చేపట్టారు. ఈ కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగిందని, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని రైల్వే అధికారులు పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి రైల్వే కార్యకలాపాలను అడ్డుకున్నారనే ఆరోపణలతో కల్వకుంట్ల కవితతో పాటు మరో పన్నెండు మందిపై రైల్వే చట్టంలోని 147, 74(ఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగానే ఈ ఆందోళన చేపట్టినట్లు తెలంగాణ రక్షణ సేన నాయకులు చెబుతున్నారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్న తమపై కేసులు నమోదు చేయడం సరికాదని వారు వాదిస్తున్నారు. మరోవైపు ప్రజలకు అసౌకర్యం కలిగించేలా రైళ్లను అడ్డుకోవడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ కావడంతో ఈ కేసుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. రేపు ఆమె కోర్టుకు హాజరుకానుండటంతో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. ఈ కేసులో కోర్టు ముందు ఆమె తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించే అవకాశం ఉంది. మరోవైపు బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ మరింత వేడెక్కుతోంది. బీసీ వర్గాలకు అధిక రిజర్వేషన్లు కల్పించాలని చాలా కాలంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన రైల్‌రోకో ఆందోళన రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# బతుకు భారంగా..

- రానున్న రోజుల్లో ధరల భారం ముంచెత్తనుందా
- హైదరాబాద్ వేదికగా ప్రధాని 'ముందస్తు జాగ్రత్త' పిలుపు
- గడ్డు పరిస్థితులకు సంకేతమనే భయం
- దేశ వ్యాప్తంగా మొదలైన చర్చ
- రానున్న రోజుల్లో మరింత మండిపోనున్న చమురు
- అంతర్జాతీయ మార్కెట్లో 50% పెరిగిన ముడిచమురు
- ఇంధన పొదుపు, ప్రజా రవాణా, వర్క్ ఫ్రమ్ హోమ్..
- భారతీయుల జీవనశైలి మారబోతుందా?
- గల్ఫ్ యుద్ధ మేఘాలు, ట్రంప్ నిర్ణయాలతో సామాన్యులపై తీవ్ర ప్రభావవం
- ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్న ఆర్థిక నిపుణులు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**



మధ్యప్రాచ్య దేశాల్లో రాజుకున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు భారతీయ సామాన్యుడి వంటింట్లో పొగలు చిమ్ముతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు బారెల్‌కు రికార్డు స్థాయికి చేరుతుండటంతో, దేశంలో చమురు కంపెనీలు భరించలేనంత నష్టాల్లో కూరుకుపోయాయి. ఇప్పటివరకు ప్రభుత్వం ధరలను నియంత్రించినా, ఇకపై అది అసాధ్యమని ఆర్థిక నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు రాబోయే 'ధరల సునామీ'కి ముందస్తు హెచ్చరికలుగా కనిపిస్తున్నాయి.

### సామాన్యుడు అతలాకుతలం..

రాబోయే రోజుల్లో ఇంధన ధరల పెంపు కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా, సామాన్యుడి జీవితాన్ని అడుగడుగునా దెబ్బతీసే ప్రమాదం ఉంది. డీజిల్ ధర పెరిగితే రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగి, నిత్యావసర వస్తువులైన బియ్యం, పప్పులు, పాలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఇది మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్‌ను పూర్తిగా అస్తవ్యస్తం చేస్తుంది. రైతాంగం కూడా ట్రాక్టర్లు, పంపుసెట్ల వాడకంపై పెరిగే పెట్టుబడి భారంతో విలవిలలాడే అవకాశం ఉంది. చమురు సంస్థలు ఆర్థికంగా దెబ్బతింటే భవిష్యత్ క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడి, దేశ ప్రగతి కుంటుపడుతుంది. జపాన్, బ్రిటన్ వంటి దేశాలు ఇప్పటికే భారీగా ధరలు పెంచగా, భారత్ కూడా అదే బాటలో నడవక తప్పని స్థితి కనిపిస్తోంది. ప్రజలు ఇప్పుడే పొదుపు బాట పట్టి, రాబోయే ధరల సునామీని తట్టుకునేందుకు సిద్ధం కావాల్సి ఉంది

### హైదరాబాద్ సభలో మోదీ సంకేతం..

సాధారణంగా ఎన్నికల వేళ లేదా అభివృద్ధి పనుల శంకుస్థాపనల వేళ ప్రధాని ప్రసంగాలు ఆశాజనకంగా ఉంటాయి. కానీ, హైదరాబాద్ వేదికగా మోదీ చేసిన ప్రసంగంలో భవిష్యత్తుపై ఆందోళన స్పష్టంగా కనిపించింది. 'ప్రజలు ఇంధనాన్ని ఆదా చేయాలి.. వ్యక్తిగత వాహనాలకు బదులు మెట్రో, బస్సుల వంటి ప్రజా రవాణాను ఆశ్రయించాలి.. అవసరమైతే తప్ప బంగారం కొనుగోలు చేయొద్దు' అని ఆయన పిలుపునివ్వడం వెనుక పెను ప్రమాదం దాగి ఉంది. చమురు ధరలు పెరిగితే నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతాయని, అప్పుడు సామాన్యుడి బడ్జెట్ అతలాకుతలం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రారంభించాలని ఐటీ రంగ సంస్థలకు సూచించడం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది.

### చమురు సంస్థల విలవిల

భారతదేశంలోని ప్రధాన చమురు సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు 50 శాతం పెరిగినా, భారత్‌లో పెట్రోల్ రూ. 94.77, డీజిల్ రూ. 87.67 వద్దే ఉంది. ఈ వ్యత్యాసం వల్ల ఈ సంస్థలకు రోజుకు రూ. 1,600 నుంచి రూ. 1,700 కోట్ల వరకు నష్టం వస్తోంది. ఇప్పటివరకు ఈ అండర్ రికవరీ నష్టం రూ. 1 లక్ష కోట్లు దాటిపోయింది. చమురు సంస్థలు దివాళా తీయకుండా ఉండాలంటే ధరలు పెంచడం మినహా ప్రభుత్వానికి మరో మార్గం లేదు. ఒకవేళ ప్రభుత్వం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా, లీటర్ పెట్రోల్‌పై ఏకంగా రూ. 10 నుంచి రూ. 20 వరకు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### గల్ఫ్ యుద్ధం.. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న గల్ఫ్ వార్ విధానాలు అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరాను దెబ్బతీశాయి. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. అందులో మెజారిటీ వాటా మధ్యప్రాచ్య దేశాలదే. అక్కడ యుద్ధం వల్ల సరఫరా ఆగితే లేదా ధరలు పెరిగితే, మన దేశ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పెరిగి రూపాయి విలువ మరింత పడిపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల కేవలం పెట్రోల్ మాత్రమే కాదు, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ప్రతి వస్తువు ధర పెరుగుతుంది. ఇది సామాన్యుడి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తుంది.

### ప్రభుత్వ ప్రయత్నాలు ఫలిస్తాయా?

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ. 13 నుంచి రూ. 3 కి, డీజిల్‌పై సున్నాకు తగ్గించి సామాన్యుడిని ఆదుకునే ప్రయత్నం చేసింది. దీనివల్ల ప్రభుత్వానికి నెలకు రూ. 14వేల కోట్ల ఆదాయం గండి పడుతోంది. ఇంత చేస్తున్నా అంతర్జాతీయ ధరలు తగ్గకపోవడంతో ప్రభుత్వం చేతులు ఎత్తేసే పరిస్థితి వచ్చింది. అందుకే మోదీ ప్రజలను స్వీయ నియంత్రణ పాటించాలని కోరుతున్నారు.

## మావోయిస్టు అగ్రనేత నరహరి లొంగుబాటు

**వేద న్యూస్, హైదరాబాద్**

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోశ్ తెలంగాణ పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఝార్ఖండ్‌లోని సరండా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్న వేళ ఆయన లొంగిపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్రా కోసం భద్రతా బలగాలు గాలింపు కొనసాగిస్తున్న సమయంలో నరహరి తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట సరెండర్ కావడం చర్చనీయాంశమైంది. నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లాలోని కాజీపేట మండలం సోమిడి గ్రామం కాగా, ఆయన భార్య ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళగా సమాచారం. 1996 నుంచి అజ్ఞాతంలో ఉన్న నరహరి మావోయిస్టు కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ క్రమంగా కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు. మావోయిస్టు అగ్రనేతలు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ అలియాస్ గణపతి, మిసిర్ బెస్రాకు అత్యంత సన్నిహితుడిగా పనిచేసినట్లు భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. మూడు దశాబ్దాలుగా అజ్ఞాత జీవితం గడిపిన నరహరి పలు కీలక ఆపరేషన్లలో ప్రధాన పాత్ర పోషించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వ్యూహాత్మక చర్యల్లో ఆయన ప్రమేయంపై దర్యాప్తు సంస్థలకు కీలక సమాచారం ఉన్నట్లు వెల్లడించాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌లో భద్రతా బలగాలు మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో నరహరి లొంగిపోవడం కీలక పరిణామంగా భావిస్తున్నారు. మరోవైపు మిసిర్ బెస్రా ఆచూకీ కోసం దర్యాప్తు సంస్థలు ప్రత్యేక దృష్టి సారించగా, మావోయిస్టుల బలమైన స్థావరాలుగా భావిస్తున్న ప్రాంతాల్లో కూంబింగ్ కొనసాగుతోంది.

## రెండోసారి సీఎంగా హిమంత

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మరోసారి ప్రమాణ స్వీకారం చేశారు. వరుసగా రెండోసారి ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య హిమంత బిశ్వ శర్మ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గౌహతిలో జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ కూటమి నేతలు హాజరయ్యారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు భారీగా పాల్గొన్నారు. అస్సాంలో వరుసగా మూడోసారి ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. హిమంత బిశ్వ శర్మతో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. భారతీయ జనతా పార్టీ నేత రామేశ్వర్ తేలి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కూటమి భాగస్వామ్య పార్టీలైన అసోం గణ పరిషత్‌కు చెందిన అతుల్ బోరా, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ నేత చరణ్ బోరాలు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త మంత్రివర్గంలో ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 126 స్థానాలున్న అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి 102 స్థానాలను కైవసం చేసుకుంది. అందులో భారతీయ జనతా పార్టీ ఒక్కటే 82 స్థానాల్లో విజయం సాధించింది. కూటమి భాగస్వామ్య పార్టీలై.న అసోం గణ పరిషత్, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ చెరో పది స్థానాలు గెలుచుకున్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత హిమంత బిశ్వ శర్మనే మరోసారి ముఖ్యమంత్రిగా కొనసాగించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలు ప్రజల్లో మంచి స్పందన తెచ్చాయని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన హిమంత బిశ్వ శర్మ రాష్ట్ర అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో అస్సాంలో రాజకీయంగా కొత్త దశ ప్రారంభమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- నీట్ పేపర్ లీక్ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టాలి
- కేంద్రంపై కేటీఆర్ ఆగ్రహం

**వేద న్యూస్, హైదరాబాద్**



నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడంతో పరీక్షనే రద్దు చేయాల్సిన పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడిందని తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, పగలు రాత్రి కష్టపడి చదివిన లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను కేంద్ర ప్రభుత్వం అనిశ్చితిలోకి నెట్టిందని అన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంలో ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 2024లో కూడా నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదని కేటీఆర్ విమర్శించారు. అదే నిర్లక్ష్యం కారణంగా ఈసారి కూడా ప్రశ్నాపత్రం లీక్ జరిగిందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నిర్వహణలో వరుసగా జరుగుతున్న లోపాలు విద్యార్థుల పట్ల శాపంగా మారాయని అన్నారు. పరీక్షకు ముందు రోజే వందకు పైగా ప్రశ్నలు లీక్ కావడం వ్యవస్థలోని తీవ్రమైన వైఫల్యాలను బయటపెట్టిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, ఇప్పుడు పరీక్ష రద్దుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఎంత పెద్ద వ్యక్తులు ఉన్నా వారందరినీ గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా నీట్ పరీక్షను పారదర్శకంగా, పకడ్బందీగా మళ్లీ నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

**వేద న్యూస్, హైదరాబాద్**

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతను జూన్ 2న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ అంశాలపై ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలో మీటర్ల పరిధిలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో నగరాలకు దూరంగా నిర్మించిన ఇళ్లలో నివసించేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని క్షేత్రస్థాయి పరిశీలనల్లో స్పష్టమైందని మంత్రి తెలిపారు. జీవనోపాధి అవకాశాలు దూరమవుతాయనే కారణంతో చాలా మంది అక్కడి కి వెళ్లడం లేదని చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, మురికివాడలు, భూదాన్ భూములు, శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్ల ప్రాంతాలను గుర్తించి కొత్త ఇండ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ జి. ప్రసాద్ కుమార్, మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, మండలి చీఫ్ విప్ పి. మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పేదలకు మెరుగైన గృహ వసతి కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# మొక్కలే జీవావరణానికి మూలం





రవిబాబు పిట్టల,
పర్యావరణవేత్త, ఫార్మర్ అసిస్టెంట్ ప్రొఫెసర్,
జే.ఎన్.టీ.యు.హెచ్,
హైదరాబాద్. సెల్: +91 9849425271

**వేద న్యూస్, డెస్క్:**

మొక్కలు మన గ్రహం యొక్క ఊపిరితిత్తులు మరియు జీవనాధారం. మనం పీల్చే ఆక్సిజన్‌లో 98 శాతం మరియు మనం తినే ఆహారంలో 80 శాతం మొక్కల నుండే లభిస్తాయి. ఈ కీలకమైన మొక్కల ఆరోగ్యాన్ని కాపాడటం ద్వారా ఆకలిని తగ్గించడం, పేదరికాన్ని నిర్మూలించడం, జీవవైవిధ్యాన్ని రక్షించడం మరియు ఆర్థికాభివృద్ధిని పెంపొందించడం వంటి లక్ష్యాలతో, ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం మే 12ను అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవంగా (ఇంటర్నేషనల్ డే అఫ్ ప్లాంట్ హెల్త్ - ఐ.డి.పి.హెచ్) జరుపుకుంటుంది. 2026లో కూడా "మొక్కలను రక్షించడం, జీవనాన్ని రక్షించడం" (ప్రొటెక్టింగ్ ప్లాంట్స్, ప్రొటెక్టింగ్ లైఫ్) అనే ముఖ్య ఉద్దేశ్యంతో, తెగుళ్ళ మరియు వ్యాధుల నుండి మొక్కలను సంరక్షించడంపై ప్రపంచవ్యాప్త అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. 2026 మొక్కల ఆరోగ్య దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు ఆహార భద్రత. ప్రపంచ ఆహార భద్రత ప్రతి సంవత్సరం 40శాతం ఆహార పంటలు మొక్కల తెగుళ్ల వల్ల నష్టపోతున్నాయి. వీటిని తగ్గించడం. పర్యావరణ పరిరక్షణ లోభాగంగా వాతావరణ మార్పుల నుండి ప్రకృతిని, జీవవైవిధ్యాన్ని రక్షించడం. ఒకదేశ ఆర్థికాభివృద్ధి ఆదేశాజంలోని మొక్కల వ్యాధుల వల్ల కలిగే $220 బిలియన్లకు పైగా నష్టాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని సుస్థిరం చేయడం జరుగుతుంది. మొక్కల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం అంటే మన భవిష్యత్తును మనం కాపాడుకోవడమే.

### అనంత విశ్వంలో భూమి- జీవానికి ఆధారమైన ఏకైక గృహం

అనంతమైన విశ్వంలో జీవరాశి విలసిల్లుతున్న ఏకైక గ్రహం భూమి మాత్రమే కావడం వెనుక ఒక అద్భుతమైన శాస్త్రీయ సమతుల్యత దాగి ఉంది. సూర్యుడు ఈ భూమికి ప్రధాన శక్తి వనరుగా నిలవగా, ఆ సూర్యరశ్మిని గ్రహించి కిరణజన్య సంయోగక్రియ (ఫోటోసింతసిస్) ద్వారా ఆహారంగా మరియు ప్రాణవాయువుగా మార్చగలిగే శక్తి కేవలం మొక్కలకు మాత్రమే ఉంది. మొక్కలు కార్బన్ డయాక్సైడ్ మరియు నీటిని ఉపయోగించుకుని గ్లూకోజ్‌ను తయారు చేస్తూ, సమస్త జీవరాశికి అవసరమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. ఈ క్రమంలో మొక్కలు "ప్రాథమిక ఉత్పత్తిదారులు"గా వ్యవహరిస్తూ, ప్రతి ఆహార గొలుసు (ఫుడ్ చైన్) కు పునాదిగా నిలుస్తున్నాయి; అంటే మనం తినే శాకాహారం నుండి, పరోక్షంగా లభించే మాంసాహారం వరకు ప్రతిదీ మొక్కల నుంచే మొదలవుతుంది. ఒకవేళ మొక్కలు లేకపోతే ఆహార ఉత్పత్తి ఆగిపోవడమే కాకుండా, వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పెరిగి భూమి వేడెక్కడం (గ్లోబల్ వార్మింగ్) మరియు ఆక్సిజన్ కొరత ఏర్పడి మొత్తం జీవవ్యవస్థే కూలిపోతుంది. సూర్యరశ్మి, మొక్కలు, ఆహారం మరియు ఆక్సిజన్ అనేవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న జీవన సూత్రాలు. కాబట్టి, భూమిపై జీవం నిలబడాలన్నా, భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణం అందాలన్నా మొక్కలను కాపాడటం అనేది మనందరి ప్రాథమిక బాధ్యత; ఎందుకంటే మొక్కలు లేని భూమిపై మనుగడ అనేది అసాధ్యం.

### మొక్కల ఆరోగ్యం- జీవావరణానికి మూలస్తంభం

జీవావరణం (ఏకోసిస్టం) లో మొక్కలు ప్రాథమిక ఉత్పత్తిదారులు (ప్రైమరీ ప్రొడ్యూసర్స్) గా కీలక పాత్ర పోషిస్తాయి. కిరణజన్య సంయోగ క్రియ (ఫోటోసింతసిస్) ద్వారా సూర్యకాంతిని ఉపయోగించి కార్బన్ డయాక్సైడ్ మరియు నీటిని గ్లూకోజ్‌గా మార్చి ఆక్సిజన్ విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియ వల్ల భూమిపై ఉన్న అన్ని జీవులకు ఆహారం మరియు శ్వాసకు అవసరమైన ఆక్సిజన్ అందుతుంది. కాబట్టి మొక్కలు ఆరోగ్యంగా ఉంటేనే జీవావరణ సమతుల్యత (ఎకలోజికల్ బాలన్స్) నిలబడుతుంది. పోషకాహారం మరియు ఆహార భద్రతలో పాత్ర ఎంతో ఉంటుంది. మొక్కలు మనిషితో పాటు అన్ని జంతువులకు ప్రాథమిక ఆహార వనరులు. పంటల ఆరోగ్యం సరిగా ఉంటేనే ధాన్యాలు, కూరగాయలు, పండ్లు వంటి పౌష్టికాహారం సమృద్ధిగా లభిస్తుంది. మొక్కలు రోగాలకు గురైతే లేదా పురుగుల దాడికి లోనైతే దిగుబడులు తగ్గి ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది. అందువల్ల మొక్కల ఆరోగ్యం కాపాడటం అనేది ప్రపంచవ్యాప్తంగా పోషకాహార సంక్షేమానికి అనివార్యం. రోగాలు, పురుగులు మరియు ప్రభావాలు ఎంతో ఉంటుంది. మొక్కలు వివిధ రకాల సూక్ష్మజీవులు (బాక్టీరియా, ఫంగస్, వైరస్) మరియు కీటక దాడులకు గురవుతాయి. ఇవి మొక్కల పెరుగుదల, ఫోటోసింథసిస్ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. ఉదాహరణకు పంటలలో బ్లాస్ట్, విల్ట్, రస్ట్ వంటి వ్యాధులు భారీ నష్టాన్ని కలిగిస్తాయి. ఈ సమస్యలు పెరిగితే ఆహార ఉత్పత్తి తగ్గి, ఆర్థిక నష్టాలు మరియు జీవావరణ అసమతుల్యతలు ఏర్పడతాయి.

### గాలి-నీరు-ఆహారం: జీవానికి మూలాధారాలు:

జీవరాశి మనుగడకు అత్యంత ఆవశ్యకమైన గాలి, నీరు, ఆహారం అనే మూడు మూలాధారాలలో 'ఆహారం' అనేది శక్తిని, పెరుగుదలను ఇచ్చే ప్రధాన వనరు కాగా, ఈ ఆహార వ్యవస్థకు మొక్కలే అసలైన పునాది. భూమిపై ఉన్న సమస్త జీవశక్తికి మూలమైన సూర్యరశ్మిని ఉపయోగించుకుని, మొక్కలు కిరణజన్య సంయోగక్రియ (ఫోటోసింతసిస్ ) అనే అద్భుతమైన ప్రక్రియ ద్వారా కార్బన్ డయాక్సైడ్ మరియు నీటిని ఆహారంగా (గ్లూకోజ్) మారుస్తాయి. ఈ ప్రక్రియలో ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తూ, మొక్కలు "ప్రాథమిక ఉత్పత్తిదారులు"గా నిలుస్తున్నాయి. మనం తీసుకునే శాఖాహారం నేరుగా మొక్కల నుండి వస్తే, మాంసాహారం కూడా పరోక్షంగా మొక్కలపై ఆధారపడిన జంతువుల నుండే వస్తుంది; అంటే ప్రతి ఆహార గొలుసు (ఫుడ్ చైన్ ) మొక్కలతోనే ప్రారంభమవుతుంది. గాలిలోని కార్బన్ డయాక్సైడ్, నీరు, మరియు సూర్యరశ్మి సమన్వయంతో మొక్కలు చేసే ఈ ఆహార ఉత్పత్తి ఆగిపోతే, ఆహార గొలుసు విచ్ఛిన్నమై ఆకలి కేకలు మొదలవుతాయి, జీవ వైవిధ్యం నశిస్తుంది, మరియు భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగి జీవం ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, సూర్యరశ్మి లేకపోతే మొక్కలు ఉండవు, మొక్కలు లేకపోతే ఆహారం ఉండదు, ఆహారం లేకపోతే ఈ సృష్టిలో జీవమే ఉండదు. అందుకే మొక్కలను సంరక్షించడం అంటే కేవలం పర్యావరణాన్ని కాపాడటం మాత్రమే కాదు, మన మనుగడను మనం కాపాడుకోవడమే.

### జీవ వైవిధ్యం మరియు పర్యావరణ సమతుల్యత

ఆరోగ్యకరమైన మొక్కలు జీవ వైవిధ్యాన్ని (బయోడైవర్సిటీ) నిలబెట్టే ప్రధాన ఆధారం. అడవులు, గడ్డి భూములు, నీటి ఆవాసాలు అన్నీ మొక్కల ఆధారంగా ఏర్పడతాయి. మొక్కలు ఆరోగ్యంగా ఉన్నప్పుడు పక్షులు, కీటకాలు, జంతువులు తమ సహజ నివాసాలను పొందుతాయి. ఇది ఆహార గొలుసు (ఫుడ్ చైన్) మరియు ఆహార జాలం (ఫుడ్ వెబ్) సమతుల్యంగా కొనసాగేందుకు సహాయపడుతుంది. వాతావరణ మార్పు మరియు మొక్కల ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతాయి. మొక్కలు కార్బన్ సెక్వెస్ట్రేషన్ ద్వారా కార్బన్‌ను గ్రహించి వాతావరణ మార్పులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కానీ కాలుష్యం, వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్), నీటి కొరత, నేల నాశనం వంటి సమస్యలు మొక్కల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. దీని వల్ల భవిష్యత్తులో జీవావరణ స్థిరత్వం ప్రమాదంలో పడుతుంది. శాస్త్రీయ నిర్వహణ మరియు సంరక్షణ చర్యలు ఎంతో అవసరం. మొక్కల ఆరోగ్యాన్ని కాపాడటానికి శాస్త్రీయ పద్ధతులు అవసరం. ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మానేజ్మెంట్, సేంద్రీయ వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణ, నీటి సమర్థ వినియోగం వంటి విధానాలు ముఖ్యమైనవి. పంటల మార్పిడి (క్రాప్ రొటేషన్), జీవ ఎరువుల వినియోగం, సహజ శత్రువుల ఉపయోగం వంటి పద్ధతులు మొక్కల ఆరోగ్యాన్ని పెంచుతాయి.

### స్థిరమైన భవిష్యత్తు కోసం మొక్కల సంరక్షణ మన బాధ్యత:

మొక్కలు ఆరోగ్యంగా ఉంటేనే అన్ని జీవులు ఆరోగ్యంగా ఉంటాయి అనే సత్యం శాస్త్రీయంగా నిరూపితమైనది. కాబట్టి ప్రతి వ్యక్తి చెట్ల నాటడం, పర్యావరణాన్ని కాపాడడం, రసాయన కాలుష్యాన్ని తగ్గించడం వంటి చర్యలు చేపట్టాలి. అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం మనకు ఈ బాధ్యతను గుర్తు చేస్తుంది. మొక్కల ఆరోగ్యం అనేది కేవలం వ్యవసాయానికి సంబంధించిన అంశం కాదు; అది జీవావరణం మొత్తం ఆరోగ్యానికి ఆధారం. మొక్కలు సుస్థిరంగా ఉంటేనే ఆహార భద్రత, జీవ వైవిధ్యం, వాతావరణ సమతుల్యత అన్నీ సాధ్యమవుతాయి. అందుకే "మొక్కలు ఆరోగ్యంగా ఉంటేనే జీవం ఆరోగ్యంగా ఉంటుంది" అనే భావనను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఆచరణలో పెట్టాలి.

### ప్రపంచ వృక్ష సంపద - తలసరి లభ్యత విశ్లేషణ

ప్రపంచవ్యాప్తంగా చెట్ల పంపిణీ మరియు జనాభా నిష్పత్తిని పరిశీలిస్తే, దేశాల మధ్య భారీ అసమానతలు కనిపిస్తున్నాయి. శాస్త్రీయ అంచనాల ప్రకారం ప్రపంచంలో సుమారు 3 ట్రిలియన్ (3000 బిలియన్) చెట్లు ఉండగా, 8 బిలియన్ల జనాభాను పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచ సగటున ఒక వ్యక్తికి సుమారు 375 చెట్లు వస్తాయి. అయితే, ఈ పంపిణీ దేశ భౌగోళిక విస్తీర్ణం మరియు జనాభాపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, అత్యధికంగా 642 బిలియన్ చెట్లతో రష్యా అగ్రస్థానంలో ఉండగా, కెనడా (318 బిలియన్), బ్రెజిల్ (302 బిలియన్), అమెరికా (228 బిలియన్) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జనాభా తక్కువగా ఉండి అడవులు ఎక్కువగా ఉన్న కెనడాలో ఒక వ్యక్తికి దాదాపు 8000-9000 చెట్లు అందుబాటులో ఉండగా, రష్యాలో 4000-5000 వరకు ఉన్నాయి. దీనికి భిన్నంగా, అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో మొత్తం చెట్ల సంఖ్య 35.2 బిలియన్లు ఉన్నప్పటికీ, జనాభా ఒత్తిడి కారణంగా ప్రతి వ్యక్తికి కేవలం 25 నుండి 30 చెట్లు మాత్రమే దక్కుతున్నాయి, ఇది ప్రపంచ సగటు (0.5 హెక్టార్లు/వ్యక్తి) కంటే చాలా తక్కువగా (0.05 హెక్టార్లు) ఉంది. గయానా, సురినామ్ వంటి దేశాలు తలసరి అటవీ విస్తీర్ణంలో ముందంజలో ఉండగా, చైనాలో వ్యక్తికి సగటున 100 చెట్లు మాత్రమే ఉన్నాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలంటే, ముఖ్యంగా భారతదేశం వంటి దేశాల్లో తలసరి ప్రకృతి వనరులను పెంచడం మరియు భారీస్థాయిలో మొక్కలు నాటడం అత్యవసరమని ఈ గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. ప్రపంచంలో చెట్ల పంపిణీ అసమానంగా ఉంది. కొన్నిదేశాల్లో వేల చెట్లు ఒక్క వ్యక్తికి ఉంటే, మరికొన్ని దేశాల్లో చాలా తక్కువగా ఉన్నాయి. ఇది భవిష్యత్ పర్యావరణ సమతుల్యతకు పెద్ద సవాలు. ప్రతి వ్యక్తి కనీసం 10 చెట్లు పెంచితేనే భూమి భవిష్యత్తు సురక్షితం.

### మానవ చర్యలు - మొక్కల ఆరోగ్యంపై పెరుగుతున్న ముప్పు

మానవ ప్రేరేపిత చర్యల వల్ల నేడు మొక్కల ఆరోగ్యం మునుపెన్నడూ లేనంతగా తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటోంది, ఇది పరోక్షంగా మొత్తం జీవావరణాన్నే ప్రమాదంలోకి నెడుతోంది. వ్యవసాయంలో అధికంగా వాడుతున్న రసాయన ఎరువులు మరియు కీటకనాశకాలు నేలలోని సహజ సూక్ష్మజీవుల సమతుల్యతను దెబ్బతీస్తూ, మొక్కల సహజ రోగనిరోధక శక్తిని క్షీణింపజేస్తున్నాయి. దీనికి తోడు ప్రపంచీకరణ మరియు వాతావరణ మార్పుల వల్ల కొత్త రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా మరియు ఫంగస్‌లు వేగంగా వ్యాప్తి చెందుతూ మొక్కలలో వేర్ల కుళ్ళు, పెరుగుదల మందగించడం వంటి వ్యాధులకు కారణమవుతున్నాయి. అడవుల నరికివేత మరియు కాలుష్యం వల్ల ప్రకృతి సమతుల్యత భంగమవడంతో, మొక్కల కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం తగ్గి పంట దిగుబడులు పడిపోతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆహార భద్రత (ఫుడ్ సెక్యూరిటీ ) క్షీణించి, ఆహార గొలుసు విచ్ఛిన్నమవడమే కాకుండా మానవ ఆరోగ్యం మరియు జీవవైవిధ్యంపై కోలుకోలేని దెబ్బ పడుతుంది. కాబట్టి, సమగ్ర తెగుళ్ల నివారణ (ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మానేజ్మెంట్-ఐపీఎం), సేంద్రీయ వ్యవసాయం మరియు అడవుల సంరక్షణ వంటి శాస్త్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా మాత్రమే మనం ప్రకృతిని, తద్వారా మన మనుగడను కాపాడుకోగలము.

### భూమిపై మొక్కల ఆరోగ్యక్షీణతకు ముఖ్య కారణాలు

వృక్ష ఆరోగ్యం జీవకోటి మనుగడకు ప్రాణాధారం మరికొన్ని ప్రత్యామ్నాయాలను చూస్తే మొక్కల ఆరోగ్యానికి కారణాలు, ప్రభావాలు మరియు రక్షణ మార్గాలు మనం తెలుసుకోవాలి. మొక్కల ఆరోగ్యం అనేది కేవలం అడవులు లేదా పంటల పెరుగుదలకు మాత్రమే పరిమితం కాకుండా, ఈ భూమిపై ఉన్న ప్రతి జీవి మనుగడకు అత్యంత కీలకం. మొక్కలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కిరణజన్య సంయోగక్రియ (ఫోటోసింతసిస్), పోషకాల మార్పిడి వంటి జీవక్రియలు సమర్థవంతంగా జరిగి పర్యావరణానికి ఆక్సిజన్ మరియు ఆహారం అందుతాయి. అయితే, బాక్టీరియా, వైరస్, కీటకాలు వంటి జీవ కారణాలతో (బయోటిక్ ఫ్యాక్టర్స్) పాటు వాతావరణ మార్పులు, కాలుష్యం, నేల నాణ్యత తగ్గడం వంటి అజీవ కారణాలు (అబయోటిక్ ఫ్యాక్టర్స్) మొక్కల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. దీనివల్ల ఆకులు పసుపుబారడం, పెరుగుదల ఆగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి, ఇది క్రమంగా పంట దిగుబడి తగ్గడానికి మరియు ఆహార భద్రత ప్రమాదంలో పడటానికి దారితీస్తుంది. మొక్కల ఆరోగ్యం క్షీణిస్తే ఆహార గొలుసులో మొదటి స్థాయి దెబ్బతిని, జీవ వైవిధ్యం నశించడంతో పాటు కార్బన్ నియంత్రణ లేక గ్లోబల్ వార్మింగ్ పెరుగుతుంది. మొక్కల ఆరోగ్యాన్ని రక్షించడానికి శాస్త్రీయ సాగు పద్ధతులు, సేంద్రీయ ఎరువుల వాడకం మరియు సమర్థవంతమైన వనరుల నిర్వహణ అత్యంత అవసరం. సమగ్ర తెగుళ్ల నివారణ (ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మానేజ్మెంట్-ఐపీఎం) మరియు పంటల మార్పిడి వంటి పద్ధతులు మొక్కల రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒకవేళ మొక్కల ఆరోగ్యం క్షీణిస్తే, అది నేరుగా పంట దిగుబడిని తగ్గించి ఆహార భద్రతను (ఫుడ్ సెక్యూరిటీ) ప్రమాదంలో పడేస్తుంది, తద్వారా మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా, ఆహార గొలుసు దెబ్బతినడం, జీవ వైవిధ్యం తగ్గడం మరియు కార్బన్ గ్రహించే సామర్థ్యం క్షీణించి గ్రీన్ హౌస్ వాయువులు పెరగడం వంటి తీవ్ర పర్యావరణ సమస్యలు తలెత్తుతాయి. అంతిమంగా, ఇది ఎడారీకరణకు మరియు ఉష్ణోగ్రతల పెరుగుదలకు దారితీసి జీవావరణ అసమతుల్యతను కలిగిస్తుంది, కాబట్టి మొక్కల సంరక్షణ అనేది కేవలం వ్యవసాయం మాత్రమే కాదు, భూమి మనుగడకు అవసరమైన ఒక అనివార్య చర్య. మొక్కలు ఆరోగ్యంగా ఉంటేనే ఆహారం, ఆక్సిజన్, జీవ వైవిధ్యం, వాతావరణ సమతుల్యత అన్నీ కాపాడబడతాయి.

### మన భవిష్యత్తు - మొక్కల చేతుల్లోనే

అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, భూమిపై జీవరాశి మనుగడకు మొక్కలే ప్రాణాధారమని చాటిచెబుతూ ఇచ్చే ముగింపు సందేశం ఏమిటంటే... "మన భవిష్యత్తు మొక్కల చేతుల్లోనే". అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు, అది భూమిపై ఉన్న ప్రతి జీవి మనుగడ కోసం ప్రకృతి ఇస్తున్న హెచ్చరిక. "మొక్కల ఆరోగ్యం = భూమి ఆరోగ్యం = మానవ ఆరోగ్యం" అనే సూత్రం నేటి తరం అర్థం చేసుకోవాల్సిన పరమ సత్యం. శాస్త్రీయ విశ్లేషణలు వెల్లడిస్తున్నట్లుగా, భారతదేశం వంటి జనసాంద్రత కలిగిన దేశాల్లో తలసరి చెట్ల సంఖ్య ప్రపంచ సగటు కంటే ఆందోళనకరంగా తక్కువగా ఉంది. ఈ లోటును పూడ్చకపోతే భవిష్యత్తులో ఆహార భద్రత, స్వచ్ఛమైన గాలి మరియు నీటి లభ్యత ప్రశ్నార్థకంగా మారుతాయి. మానవ చర్యల వల్ల కలిగే కాలుష్యం, విచ్చలవిడి రసాయనాల వినియోగం మరియు వాతావరణ మార్పుల నుండి మొక్కలను రక్షించుకోవడం మన తక్షణ కర్తవ్యం. స్థిరమైన మరియు సురక్షితమైన రేపటి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం 10 మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలి. ప్రకృతితో మమేకమై, శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తూ, అడవులను కాపాడుకుంటేనే అనంత విశ్వంలో మన ఏకైక గృహమైన ఈ 'నీలి గ్రహం' పచ్చగా కళకళలాడుతుంది. అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలతో.... మొక్కలను కాపాడుకోవటమే ప్రస్తుత మన కర్తవ్యంగా ముందుకెళ్లాలి. "ప్రకృతిని మనం కాపాడితే.. ఆ పచ్చదనమే మనల్ని, మన భవిష్యత్ తరాలను కాపాడుతుంది."

# ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

- ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను స్మరించిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్



**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలోని పద్మా అపార్ట్‌మెంట్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఆర్. పుట్టరాజు, డాక్టర్ బి.సీ. రామన్న, సోషల్ వర్కర్ ఇ. దేవానంద్ యాదవ్ పాల్గొని నర్సింగ్ సేవల ప్రాధాన్యతను వివరించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జీవిత సేవలను స్మరించుకుంటూ, నేటి యువ నర్సులు ఆమెను ఆదర్శంగా తీసుకుని సేవా భావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిమ్స్, ఉస్మానియా, ఈఎస్ఐ, భేల్ జనరల్ హాస్పిటల్ సహా వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న 80 మంది నర్సులను ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులతో సత్కరించారు. శాలువాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా గౌరవించారు. ఈ కార్యక్రమంలో నందూరి వెంకటేశ్వరరాజు, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, జి.వి.రావు, విజయలక్ష్మి, విష్ణుప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద మహిళ అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



గీసుకొండ మండల కేంద్రానికి చాపర్తి లచ్చుమ్మ అనే నిరుపేద మహిళ అనారోగ్యంతో మరణించారు. కొన్నేళ్ల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో మృతురాలి కొడుకు మరణించగా భర్త కూడా వృద్ధాప్యంలో ఉన్న వారి దయనీయ స్థితిని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ మానవత్వంతో స్పందించి రూ.5000 సాయం పంపగా, అట్టి నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు గీసుకొండ సోషల్ సర్వీస్ టీం ప్రతినిధులు కర్ణకంటి రాంమూర్తి, ముల్క సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రజక సంఘం పెద్దలు చాపర్తి శ్రీను, సాంబయ్య, అనిల్, రాజమౌళి, వరుణ్,సింగారపు రాజు, చాపర్తి రాజగోపాల్, నవీన్, రాకేశ్, మరియు సూరిపల్లి మాజీ సర్పంచ్ గాదె భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్



# బండి భగీరథును వెంటనే అరెస్టు చేయాలి

**వేద న్యూస్, నిజామాబాద్ ప్రతినిధి :**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ మైనర్ బాలిక పైన లైంగిక దాడికి పాల్పడిన భగీరథును వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలనీ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భీంగల్ ఏరియా కార్యదర్శి వి.బాలయ్య, బోన్ల నర్సయ్య, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబటి సుమన్ డిమాండ్ చేసారు. స్నేహితుడు ద్వారా 17 ఏళ్ల బాలికను పరిచయం చేసుకుని ప్రేమిస్తున్నానని నమ్మ బలికి మేజర్ అయ్యాక పెళ్లి చేసుకుందామని ట్రాప్ చేసి శారీరకంగా వాడుకొని అమ్మాయిని మోసం చేసి మొయినాబాద్ ఫామ్ హౌస్ కు తీసుకెళ్లి బలవంతంగా డ్రగ్స్ ఎక్కించి మద్యం తాగించి బాలికపై పలు మార్లు అత్యాచారం జరిపిన బండి భగీరథ పై ఫోక్సో కేస్ పెట్టి 20 సంవత్సరాల పాటు శిక్ష పడే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు. భగీరథకు శిక్ష పడ్డరోజే పేద వారికి ధనిక వర్గానికి ఒకే చట్టం ఉన్నట్టు రుజువుతుందని ప్రజల్లో చట్టంపై నమ్మకం పెరుగుతుంది అని అన్నారు. గతంలో కాలేజీలో తోటి విద్యార్థులపై భౌతిక దాడులకు పాల్పడ్డ ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. డబ్బు అధికార బలంతో అమ్మాయిల జీవితాలతో చెలగాటమాడే భగీరథ లాంటి నరరూప రాక్షసులను కఠినంగా శిక్షించి మహిళలకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి భీంగల్ ఏరియా కార్యదర్శి వి.బాలయ్య



తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబటి సుమన్

# ఘనంగా రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

**వేద న్యూస్, రుద్రూర్ :**





రుద్రూర్ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, నాయకులు పత్తి రాము, తోట సంగయ్య, అక్కపల్లి నాగేందర్, గౌడ సంఘం అధ్యక్షులు గుండూరి విఠల్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, సతీష్ గౌడ్, నారా గౌడ్, శ్రీను గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముక్తిని ప్రసాదించే బల్కంపేట ఎల్లమ్మ

- కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా భక్తుల విశ్వాసం
- బోనాల వేళ భక్తులతో కిటకిటలాడే అమ్మవారి ఆలయం
- రాజకీయ నాయకులు సైతం బీ ఫారాల కోసం మొక్కులు చెల్లించే క్షేత్రం
- ఆషాఢ మాసంలో నెల రోజుల పాటు బోనాల ఉత్సవాలు
- 700 ఏళ్ల చరిత్ర కలిగిన స్వయంభూ అమ్మవారి ఆలయం





**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**

భాగ్యనగరంలోని ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాల్లో బల్కంపేట రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఆషాఢ మాసం రాగానే బోనాల ఉత్సవాలతో బల్కంపేట ప్రాంతం భక్తి పారవశ్యంతో కళకళలాడుతుంది. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య అమ్మవారికి జరిగే వేడుకలు వేలాది భక్తులను ఆకట్టుకుంటాయి. అమ్మవారిని కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పు దైవంగా భక్తులు భావిస్తారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు అమ్మవారికి మొక్కుకుంటే బీ-ఫారాలు వస్తాయని విశ్వసిస్తుంటారు. బోనాల సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడి బియ్యం పోసి, చీర సారెలతో మొక్కులు తీర్చుకుంటారు. ఆషాఢ మాసంలో నెల రోజుల పాటు ఆలయంలో బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ప్రతి ఏడాది తొలి మంగళవారం అమ్మవారికి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. అమ్మవారి కల్యాణాన్ని దర్శిస్తే కోరికలు నెరవేరుతాయని, యువతకు వివాహ యోగం కలుగుతుందని భక్తుల నమ్మకం. బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి సుమారు 700 ఏళ్ల చరిత్ర ఉందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఓ రైతు బావి తవ్వుతుండగా అమ్మవారి స్వరూపం బయటపడటంతో గ్రామస్తులు అక్కడే ఆలయం నిర్మించినట్లు చెబుతారు. అనంతరం 1919లో రాజా శివరాజ్ బహద్దూర్ ఆధ్వర్యంలో ఆధునిక ఆలయం నిర్మితమైంది. ఆలయంలో అమ్మవారు స్వయంభూ రూపంలో కొలువుదీరారు. అమ్మవారి విగ్రహం వెనుక భాగం నుంచి నిరంతరం జలధార ప్రవహిస్తూ ఉంటుంది. ఆ తీర్థాన్ని భక్తులు పవిత్రంగా భావించి ఇంటికి తీసుకెళ్తారు. ఆ నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు, అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. అమ్మవారిని దర్శించుకుంటే కష్టాలు తొలగి శాంతి, సౌఖ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసంతో ప్రతి ఏడాది లక్షలాది మంది బల్కంపేట ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్నారు.

# మంత్రి తుమ్మల ఆత్మీయ సభను విజయవంతం చేయాలి

- నూతి సత్యనారాయణ గౌడ్



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రి పదవి చేపట్టి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీ జీఎన్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించే ఆత్మీయ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తుమ్మల నాగేశ్వరరావు అభివృద్ధి, రైతు సంక్షేమానికి కృషి చేసిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ షెడ్లను తొలగించాలి..

- కాలనీవాసుల డిమాండ్



**వేద న్యూస్, శేరిలింగంపల్లి:**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కొండాపూర్ చంద్రబాబు గెస్ట్ హౌస్ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నారని స్థానిక కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని భారీ గాలులు వీచే సమయంలో రేకులు ఎగిరిపడి స్థానికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ఈ అక్రమ షెడ్లను వెంటనే డెమోలిష్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని స్థానికులు హెచ్చరించారు.

# నర్సులకు ఘన సన్మానం

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులను శాలువాలు, బొకేలు అందించి ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. మన నర్సులు.. మన భవిష్యత్తు, సంరక్షణే శక్తి అనే భావనతో నర్సుల సేవలను కొనియాడారు. ప్రాణం పోసేది వైద్యులు అయితే.. ఆ ప్రాణాన్ని కంటికి రెప్పలా కాపాడేది నర్సులేనని, ప్రజా ఆరోగ్య సంరక్షణలో వారి సేవలు అమూల్యమని అన్నారు. నిస్వార్థ సేవ, అంకితభావానికి నర్సులు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ క్రాంతి కుమార్, ఆర్గనైజర్ శ్రావణ్, చిలకపల్లి భవాని, ఉప్పాల శారద తదితరులు పాల్గొని నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్లీనరీకి జన సమితి నాయకులు

**వేద న్యూస్, మెట్‌పల్లి:**



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం అధ్యక్షతన హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ జన సమితి 4వ ప్లీనరీ సమావేశానికి మెట్‌పల్లి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివెళ్లాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు కంతి రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జిల్లాపెల్లి దిలీప్‌తో పాటు వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి

**వేద న్యూస్, గంగాధర:**



హనుమాన్ జయంతి సందర్భంగా గంగాధర మండలం గంగరావుపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి చందనం, సింధూరం, తమలపాకులతో విశేష అలంకరణ చేసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హనుమంతుడి భక్తి, ధైర్యం, నిస్వార్థ సేవ గురించి భక్తులకు వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, ఉత్సవ విగ్రహ ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య, ఉపసర్పంచ్ దేవబహదూర్ రెడ్డి, గుడి చైర్మన్ సుద్దాల సత్యనారాయణ రెడ్డి, కనపర్తి తిరుపతాచారి, గంగాధర మల్లయ్యతో పాటు గ్రామ ప్రజలు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

# వేసవిలో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



- డాక్టర్ అనితా రెడ్డి

**వేద న్యూస్, హనుమకొండ :**

వేసవి సెలవుల్లో పిల్లలు ఈతల పేరిట జలాశయాల్లోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పిల్లల చదువు, అలవాట్లు, ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. తల్లిదండ్రుల ప్రవర్తన, మాట్లాడే తీరు పిల్లలపై ప్రభావం చూపుతుందని, వారికి సమయం కేటాయించకపోతే సెల్‌ఫోన్‌లకు బానిసలై చెడు సావాసాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వేసవి సెలవులు పిల్లలకు ఆనందంగా, ఆహ్లాదకరంగా గడిచేలా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుటుంబంలో మహిళలు, పురుషులు పరస్పర అవగాహనతో మెలగాలని, వృద్ధుల పట్ల గౌరవభావం కలిగేలా పిల్లలకు మంచి అలవాట్లు, నడవడిక నేర్పాలని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు.

# భూమి వివాదంపై అధికారులకు ఫిర్యాదు



**వేద న్యూస్, మెట్‌పల్లి :**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామానికి చెందిన చిన్నరెడ్డి అనే వ్యక్తిని భూమి విషయంలో ఓ మహిళ వేధింపులకు గురిచేస్తూ చంపుతానని బెదిరిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గడ్డం రాజారెడ్డి అనే వ్యక్తి 1989లో వడ్ల రాజన్న వద్ద నుంచి 16 గుంటల భూమిని కొనుగోలు చేసి అప్పటి నుంచి సాగు చేస్తున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం వడ్ల రాజన్న మూడో కుమార్తె ఆ భూమి తమదేనంటూ వివాదం సృష్టిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై సుమారు 18 ఏళ్ల క్రితమే అధికారులు గడ్డం రాజారెడ్డికే భూమి చెందుతుందని తేల్చినప్పటికీ, రెవెన్యూ మరియు పోలీసు అధికారులు మారినప్పుడల్లా ఫిర్యాదులు చేస్తూ వేధిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది రౌడీషీటర్లు, రాజకీయ నాయకులతో కలిసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని చిన్నరెడ్డి కోరారు.

# వైభవంగా తిరుపతమ్మ గోపయ్య ప్రతిష్ఠ మహోత్సవం

**- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు**



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన తిరుపతమ్మ గోపయ్య, అంకమ్మ తల్లి, నాగులమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ వేద పండితులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, గోపూజ, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, మూలమంత్ర హోమం, జలాభిషేకం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు, దేవాలయ నిర్మాణకర్త ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్‌తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**- ఎఫ్‌పీఓల ప్రాముఖ్యతపై అవగాహన**



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం వసంతాపురం గ్రామంలో “రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు” కార్యక్రమాన్ని శాస్త్రీయ విధానంలో నిర్వహించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సమూహాధారిత వ్యవసాయం, గ్రామీణ వ్యవసాయాభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. విద్యాధర్ మాట్లాడుతూ.. రైతుల ఆదాయ వృద్ధి, ఉత్పత్తి వ్యయాల తగ్గింపు, సమిష్టి మార్కెటింగ్‌లో ఎఫ్‌పీఓల పాత్ర కీలకమని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు సంఘటితంగా పనిచేస్తే వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని పేర్కొన్నారు. డా. సిద్ధార్థ నాయక్ మాట్లాడుతూ వసంతాపురం రైతులు ఎఫ్‌పీఓ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, ఏఈఓ సానియా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ అవకాశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్, పిపిఓ ఉస్మాన్, వరంగల్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు అశ్మిత, అరుణతో పాటు రైతులు పాల్గొన్నారు.

# కొండగట్టులో పెద్ద హనుమాన్ పూజలు

**- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మానికి ప్రతీకగా, భక్తికి నిలువెత్తు రూపంగా నిలిచిన ఆంజనేయ స్వామి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, రైతాంగానికి సమృద్ధి, ప్రజలకు సుఖశాంతులు కలగాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. హనుమంతుడి భక్తి, బలం, నిస్వార్థ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతామని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# సోలార్ విలేజ్‌గా రఘునాథపాలెం అభివృద్ధి

**- కమ్యూనిటీ భవనాలపై కూడా సోలార్ రూఫ్‌టాప్‌లు**

**- కలెక్టర్ దివాకర టీఎస్**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

రఘునాథపాలెం గ్రామాన్ని సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థ కలిగిన పైలట్ గ్రామంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం గ్రామంలో అమలవుతున్న సోలార్ మోడల్ ప్రాజెక్టును ఆయన పరిశీలించి అధికారులతో పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గ్రామంలో 1081 మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉండగా, 821 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు సాధ్యమని గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 110 ఇళ్లలో పనులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. ప్రతి ఇంటికి కనీసం 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ చెప్పారు. కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలపై కూడా సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సెన్సస్-2027 కార్యక్రమంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. జనగణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని, తప్పుడు సమాచారం ఇవ్వకుండా సరైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహీద్, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**- హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు**

**వేద న్యూస్, చిన్నచింతకుంట :**

హనుమాన్ జయంతి సందర్భంగా చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వగ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ పూజారి ఎమ్మెల్యేకు శఠగోపం పెట్టి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు.

# చిత్తనూరు ఇథనాల్ ఫ్యాక్టరీని ఎత్తివేయాలి

**- కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తాం**

**- టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ**




**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య (టీఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో చిన్న చింతకుంట మండలం పర్దిపూర్ గ్రామంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గ్రామంలోని మసీదు వరకు ర్యాలీ చేపట్టి అనంతరం టీఎఫ్‌టీయూ స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి ఘట్టన్న మే డే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. యాదగిరి మాట్లాడుతూ.. బీడీ కార్మికుల వేతనాల పెంపు విషయంలో యాజమాన్యాల మొండివైఖరి మరోసారి బయటపడిందన్నారు. పీఎఫ్, గ్రాచ్యువిటీ, వేతనాల విషయంలో ఎలాంటి మార్పులు లేకుండా చర్చలు ముగించాలని చూడటం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్ మాట్లాడుతూ.. కార్మిక హక్కుల కోసం పోరాడిన చికాగో అమరులే ప్రతి ఉద్యమానికి స్ఫూర్తి అని తెలిపారు. అభివృద్ధి పేరుతో కాలుష్య కర్మాగారాలను ప్రోత్సహించడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. చిత్తనూరు ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో నల్లవెల్లి ఆదర్శం

**- ఎంపీడీఓ ప్రశంసలు**





**వేద న్యూస్, ఇందల్వాయి:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామం ఉత్తమ ప్రతిభ కనబరిచి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. కూలీల హాజరు (లేబర్ టర్నవుట్) ను భారీగా పెంచడంలో కృషి చేసినందుకు గాను మంగళవారం మండల కేంద్రంలో నల్లవెల్లి గ్రామ బృందాన్ని ఎంపీడీఓ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని కల్పించడంలో నల్లవెల్లి గ్రామం ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన సర్పంచ్ కన్నె రాజేందర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ , పంచాయతీ కార్యదర్శి అశోక్,మరియు ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**ఫీల్డ్ అసిస్టెంట్‌కు నగదు పురస్కారం**

క్షేత్రస్థాయిలో కూలీలను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ, అత్యధిక టర్నవుట్ సాధించినందుకు గాను నల్లవెల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఎంపీడీఓ ప్రైజ్ మనీ (నగదు బహుమతి) అందజేసి ప్రోత్సహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వివిధ గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు కురుమూర్తి నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం



**వేద న్యూస్, చిన్నచింతకుంట :**

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ సమీపంలో సప్తగిరుల మధ్య వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన నూతన పాలకమండలి చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది కోరారు.

# నీట్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం
- ఎన్టీఏను తక్షణమే ప్రక్షాళన చేయాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**వేద న్యూస్, కొల్లాపూర్:**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేయాల్సిన పరిస్థితి రావడం బీజేపీ పాలన వైఫల్యానికి నిదర్శనమని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. దేశవ్యాప్తంగా వైద్య విద్య ఆశావహులను ఈ వ్యవహారం తీవ్ర ఆందోళనలోకి నెట్టిందని పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చాయని మంత్రి మండిపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని కేంద్ర ప్రభుత్వం తన అసమర్థతతో వృథా చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందుగానే హెచ్చరించినట్లుగా రాజ్యాంగబద్ధ సంస్థల నిర్వీర్యమే ఈ పరిస్థితికి కారణమని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా నీట్ పరీక్షల్లో వరుసగా పేపర్ లీకేజీలు, అవకతవకలు వెలుగులోకి వస్తున్నా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత పూర్తిగా లోపించాయని, ఫలితంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుండగా తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమన్నారు. అసమర్థతకు నిలయంగా మారిన ఎన్టీఏను తక్షణమే ప్రక్షాళన చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మెట్టుగుట్టపై ఘనంగా హనుమాన్ జయంతి

**వేద న్యూస్, మడికొండ :**



వరంగల్ మహానగరం కాజీపేట పట్టణం మడికొండ గ్రామంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్టపై గల శ్రీ సీతారామచంద్ర స్వామి, మెట్టురామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామివారికి ఫల పంచామృతాలతో అభిషేకం చేసి, తమలపాకులతో ఆకుపూజ నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా వడమాలల తో అలంకరించారు. హనుమాన్ మాలధారణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని చందనం వేసి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. స్వామివారి అభిషేకానికి కావాల్సిన పండ్లు, పంచామృతాలను మహేందర్ సమర్పించగా, పల్లపు మహేష్ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, రాగిచేడు అభిలాష్ శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలి

**వేద న్యూస్, హైదరాబాద్:**



విద్యా వారోత్సవాల్లో భాగంగా అధ్యాపకుల కోసం 'యోగా – ఆరోగ్య ప్రదాయిని' అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యా రంగంలో ఒత్తిడిని అధిగమించి విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయాలంటే అధ్యాపకులు శారీరక, మానసిక సమతుల్యతను కలిగి ఉండాలని, అందుకు యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇంగ్లీష్ విభాగం సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కృష్ణ చంద్ర కీర్తి మాట్లాడుతూ.. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది పని ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను అందించే అద్భుత సాధనమని తెలిపారు. సదస్సులో భాగంగా అధ్యాపకులు ప్రాణాయామం, ధ్యానం వంటి ప్రక్రియలను స్వయంగా అభ్యసించారు. ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని పెంపొందించడంలో ఈ కార్యక్రమం విజయవంతమైంది.

# కేంద్ర మంత్రికి చట్టం చుట్టమా..?

- బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి
- తెలంగాణ రక్షణ సేన డిమాండ్



**వేద న్యూస్, గంగాధర :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ రక్షణ సేన నాయకుడు మ్యాక వినోద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలికపై మానసిక, లైంగిక వేధింపుల ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు ఒక చట్టం, అధికారంలో ఉన్నవారికి మరో చట్టం అమలవుతుందా అని ప్రశ్నించారు. కేసు నమోదై నాలుగు రోజులు గడిచినా నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో ఉండాల్సిన కఠిన సెక్షన్లు నమోదు చేయకుండా నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిష్పాక్షికంగా వ్యవహరించి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరిన ఆయన.. చట్టంపై ప్రజలకు విశ్వాసం నిలవాలంటే నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కేసును వేగంగా విచారించాలని డిమాండ్ చేశారు.

# ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**వేద న్యూస్, మందమర్రి:**



2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ దేవానంద్ తెలిపారు. మంగళవారం ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్లలో ప్రవేశాల కోసం ఈ నెల 14 నుంచి జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో రూ. 100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని ఐటీఐలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, బేసిక్ డిజైనర్ అండ్ ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్స్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎస్ఎస్సీ మెమో, ఆధార్ కార్డు, స్టడీ మరియు కుల ధ్రువపత్రాలు, ఫోన్ నెంబర్, మెయిల్ ఐడీలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# మహిళల మనోభావాలకు రక్షణ కల్పించాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వివరణ ఇవ్వాలి
- బీఆర్ఎస్ మండల నేత ఎస్కే గౌస్



**వేద న్యూస్, శాయంపేట:**

మైనర్ బాలికపై జరిగిన ఘటనలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్కే గౌస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకరికొకరు సహకరిస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమాల నేపథ్యంలో ప్రధానమంత్రి మోడీ పట్ల ముఖ్యమంత్రి ఆకర్షితులయ్యారని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను వెంటనే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని, బేటీ బచావో-బేటీ పడావో నినాదాన్ని ఆచరణలో చూపించాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుని మహిళా సాధికారతకు కృషి చేయాలని కోరారు.

# గన్నారం శివారులో రోడ్డు ప్రమాదం

**వేద న్యూస్, ఇందల్వాయి :**

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మండల పరిధిలోని గన్నారం గ్రామ శివారులో జాతీయ రహదారి (ఎన్ హెచ్ 44) పై సోమవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన గణపురం రాములు, కుపీర్యాల సురేష్‌లు ట్రాక్టరుపై వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒక లారీ అజాగ్రత్తగా ఢీకొట్టింది. నిన్న సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ట్రాక్టరుపై ఉన్న గణపురం రాములు అక్కడికక్కడే మృతి చెందగా, కుపీర్యాల సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఇందల్వాయి ఎస్సై సందీప్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం తరలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ అతివేగం మరియు నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

# అభయాంజనేయ స్వామి ఆలయ శంకుస్థాపన

**వేద న్యూస్, మరిపెడ :**



మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని టీలావత్ తండాలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాలివారిగూడెం సర్పంచ్ నారెడ్డి కవితా రెడ్డి, సుదర్శన్ రెడ్డి దంపతులు తమ సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పాల్గొన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ నిర్మాణం పూర్తైన తర్వాత భక్తులకు ఇది ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ఆలయ నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ కవితా రెడ్డి పేర్కొన్నారు. గ్రామస్తులు సహకరించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# నకిలీ బంగారంతో బ్యాంకుకు టోకరా




**వేద న్యూస్ మెదక్ :**

మెదక్ పట్టణంలో భారీ బ్యాంకు మోసం వెలుగుచూసింది. కొందరు ఘరానా మోసగాళ్లు నకిలీ బంగారాన్ని కుదవపెట్టి బ్యాంకును కోట్లలో మోసం చేసిన ఘటన సంచలనం రేపుతోంది. స్థానిక ఆదర్శ సహకార బ్యాంకులో ఈ మోసం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో బ్యాంకు మేనేజర్ అనిల్‌తో పాటు బంగారం తనిఖీ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాస్ చారి కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు నకిలీ బంగారాన్ని అసలైనదిగా చూపించి బ్యాంకులో మొత్తం రూ. 1.79 కోట్లకు పైగా రుణాలు పొందారు. ఇందుకోసం తమ స్నేహితుల ఆధార్ కార్డులు, పాన్ కార్డులను వినియోగించినట్లు గుర్తించారు. ముగ్గురు నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో మరో కీలక విషయం బయటపడింది. ఏటీఎంలో జమ చేయాల్సిన సుమారు రూ. 31.35 లక్షలను డిపాజిట్ చేయకుండా అక్రమంగా తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో బ్యాంకు అంతర్గత సిబ్బంది సహకారం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేద న్యూస్

బుధవారం మే 13, 2026

# వృద్ధులకు ఆరోగ్య బీమా ఎందుకు అవసరం?

**వేద న్యూస్ డెస్క్:**

అరవై సంవత్సరాలు దాటిన వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య బీమా పథకాలు ప్రస్తుతం ఎంతో అవసరంగా మారుతున్నాయి. వయస్సు పెరిగే కొద్దీ అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉండటంతో పాటు వైద్య ఖర్చులు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సరైన ఆరోగ్య బీమా పాలసీ ఉంటే చికిత్స ఖర్చుల భారం తగ్గడమే కాకుండా కుటుంబానికి ఆర్థిక భరోసా కూడా లభిస్తుంది. వృద్ధుల కోసం తీసుకునే ఆరోగ్య బీమా కేవలం ఒక ఆర్థిక పథకం మాత్రమే కాదు. అనారోగ్య సమయంలో కుటుంబం ఎన్నో ఏళ్లుగా కూడబెట్టుకున్న పొదుపులను కాపాడే రక్షణ కవచంగా కూడా పనిచేస్తుంది. అందుకే పాలసీ తీసుకునే ముందు అందులోని అన్ని నిబంధనలను పూర్తిగా చదవడం చాలా ముఖ్యం అని నిపుణులు సూచిస్తున్నారు. పాలసీలో సహభారం నిబంధన ఉందా లేదా, గది అద్దె పరిమితి ఎంత వరకు ఉంది, మోకాలి మార్పిడి లేదా గుండె శస్త్రచికిత్స వంటి ఖరీదైన చికిత్సలకు ప్రత్యేక పరిమితులు ఉన్నాయా అనే విషయాలను ముందుగానే తెలుసుకోవాలి. ఉదాహరణకు రోజుకు మూడు వేల రూపాయల గది అద్దె పరిమితి ఉన్న పాలసీ తీసుకుని, ఆసుపత్రిలో గది అద్దె ఏడు వేల రూపాయలు అయితే, మిగతా చికిత్స ఖర్చులు కూడా అదే నిష్పత్తిలో తగ్గించే అవకాశం ఉంటుంది. అందుకే అరవై ఏళ్లు దాటిన తల్లిదండ్రుల కోసం ఆరోగ్య బీమా తీసుకునే ముందు వాస్తవ వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాలసీని ఎంపిక చేయాలని నిపుణులు చెబుతున్నారు. వృద్ధులకు ఆరోగ్య బీమా ఉండటం వల్ల ప్రధానంగా ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. కొన్ని పాలసీలు ముందుగా ఉన్న వ్యాధులకు పన్నెండు నెలల తర్వాత కవరేజీ ఇస్తుండగా, కంటి శుక్లాల వంటి చికిత్సలకు ఇరవై నాలుగు నెలల తర్వాత రక్షణ కల్పిస్తున్నాయి. దీని వల్ల అధిక వైద్య ఖర్చుల భయం తగ్గుతుంది. అలాగే ఇతరులపై ఆధారపడకుండా వృద్ధులు తమ వైద్య ఖర్చులను స్వయంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. చాలా బీమా సంస్థలు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స సదుపాయం కల్పిస్తున్నాయి. దీని వల్ల ముందుగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్స పొందవచ్చు. అనేక ఆరోగ్య బీమా పాలసీలు వార్షిక ఆరోగ్య పరీక్షలను కూడా కల్పిస్తాయి. దీని ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందే అవకాశం ఉంటుంది. అలాగే జీవితకాల పొదుపులను ఆసుపత్రి ఖర్చుల నుంచి కాపాడడంలో కూడా ఈ పాలసీలు సహాయపడతాయి. కొన్ని పాలసీలు నిర్దిష్ట నిరీక్షణ కాలం తర్వాత



ముందుగా ఉన్న వ్యాధులకు కూడా రక్షణ ఇస్తాయి. వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చే దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స ఖర్చులను కూడా ఇవి భరిస్తాయి. అత్యవసర వైద్య పరిస్థితుల్లో తక్షణ చికిత్స పొందేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడం కూడా ఆరోగ్య బీమా ప్రధాన ప్రయోజనంగా చెప్పవచ్చు. ఆసుపత్రిలో చేరే ముందు ముప్పై రోజుల వరకు, డిశ్చార్జ్ తర్వాత కొన్ని రోజుల వరకు వచ్చే వైద్య ఖర్చులను కూడా కొన్ని పాలసీలు కవర్ చేస్తాయి. అలాగే బెలూన్ సైనుప్లాస్టీ, రోగనిరోధక చికిత్స, మూలకణ చికిత్స వంటి ఆధునిక వైద్య విధానాలకు కూడా కొన్ని పాలసీలు పరిమితి మేరకు రక్షణ కల్పిస్తున్నాయి. ఇరవై నాలుగు గంటలలో పూర్తయ్యే చిన్న చికిత్సలు, శస్త్రచికిత్సలు కూడా డే కేర్ విధానాల కింద కవరేజ్ పొందుతాయి. ఆసుపత్రిలో చేరినప్పుడు వైద్య ఖర్చులు, ఔట్‌పేషెంట్ కన్సల్టేషన్ ఖర్చులు, వార్షిక ఆరోగ్య పరీక్షలు వంటి అనేక ప్రయోజనాలు కూడా ఇందులో ఉంటాయి. అయితే అందం కోసం చేసే శస్త్రచికిత్సలు, లింగ మార్పిడి శస్త్రచికిత్సలు, స్వయంగా చేసుకున్న గాయాలు, ప్రమాదకర క్రీడల వల్ల కలిగే గాయాలు, మద్యం లేదా మత్తు పదార్థాల దుర్వినియోగం వల్ల వచ్చే చికిత్సలు, పుట్టుకతో ఉన్న కొన్ని లోపాలకు సాధారణంగా ఆరోగ్య బీమా వర్తించదని నిపుణులు చెబుతున్నారు.

# ఈపీఎఫ్ సభ్యులకు భారీ ఊరట




**వేద న్యూస్ డెస్క్:**

ఇంటి ఖర్చులు, పెళ్లిళ్లు, వైద్య చికిత్సలు వంటి అత్యవసర అవసరాల కోసం డబ్బు కావాలంటే ఇకపై ఉద్యోగులు పెద్దగా ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా కేంద్ర ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ కొత్త విధానాన్ని తీసుకురానుంది. ఈపీఎఫ్‌వో 3.0 పేరుతో రాబోతున్న ఆధునిక వ్యవస్థ కోట్లాది మంది ఉద్యోగులకు మరింత సులభమైన సేవలను అందించనుంది. ప్రస్తుతం ఉద్యోగుల జీతాల నుంచి ప్రతి నెలా భవిష్య నిధి కోసం కొంత మొత్తం జమ అవుతోంది. పదవీ విరమణ సమయంలో ఈ మొత్తం ఉద్యోగులకు ఉపయోగపడుతుంది. ఇప్పుడు ఈపీఎఫ్‌వో 3.0 ద్వారా డబ్బు ఉపసంహరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు పూర్తిగా సాంకేతిక ఆధారితంగా మార్చుతున్నారు. ఇప్పటి వరకు స్వయంచాలక క్లెయిమ్ పరిష్కార పరిమితి ఒక లక్ష రూపాయలుగా ఉండేది. ఇప్పుడు దానిని ఐదు లక్షల రూపాయలకు పెంచనున్నారు. అలాగే గతంలో డబ్బు ఖాతాలో జమ కావడానికి దాదాపు నెలరోజులు పట్టేది. కొత్త విధానంలో మాత్రం రెండు నుంచి ఐదు రోజుల్లోనే మొత్తం ఖాతాలో జమ కానుంది. ఆధార్ ధృవీకరణతోనే చాలా పనులు పూర్తవుతాయి కాబట్టి అదనపు పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. పాస్‌బుక్ ప్రతులను అప్‌లోడ్ చేయడం వంటి ఇబ్బందులు కూడా తొలగిపోతాయి. అలాగే కేవైసీ నవీకరణ లేదా నిధుల ఉపసంహరణ  అత్యవసర అవసరాల కింద అనారోగ్యం, ఆసుపత్రి చికిత్స, వివాహం, విద్య కోసం డబ్బు తీసుకోవచ్చు. గృహ అవసరాల కింద ఇల్లు కొనుగోలు లేదా గృహ రుణ చెల్లింపులకు అవకాశం ఉంటుంది. ప్రత్యేక పరిస్థితుల కింద నిరుద్యోగం లేదా పదవీ విరమణ సమయంలో నిధులను వినియోగించుకోవచ్చు. ఈపీఎఫ్‌వో 3.0లో అత్యంత ఆసక్తికర అంశంగా నిలుస్తున్నది ఏటీఎం, యూపీఐ ద్వారా నిధుల ఉపసంహరణ సౌకర్యం. ఇప్పటి వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు నింపి రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఇకపై ప్రత్యేక కార్డు ద్వారా ఏటీఎంల నుంచి నేరుగా డబ్బు తీసుకునే అవకాశం కల్పించనున్నారు. అదే విధంగా భవిష్య నిధి ఖాతాను యూపీఐ వేదికలకు అనుసంధానం చేసి సులభంగా నిధులను వినియోగించుకునే విధానాన్ని కూడా తీసుకురానున్నారు. దీంతో కోట్లాది మంది ఉద్యోగులకు ఈ కొత్త వ్యవస్థ పెద్ద ఊరటనివ్వనుందని భావిస్తున్నారు.

# విద్యుత్ బస్సుల తయారీలో కొత్త అడుగు

**వేద న్యూస్ డెస్క్:**

విద్యుత్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు డసో సిస్టమ్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా డసో సిస్టమ్స్‌కు చెందిన త్రిమితీయ అనుభవ వేదికను ఒలెక్ట్రా వినియోగించుకోనుంది. విద్యుత్ రవాణా రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో ఉత్పత్తుల అభివృద్ధికి ఈ వేదిక ఉపయోగపడనుందని సంస్థ తెలిపింది. ఇంజినీరింగ్ ఆధారిత వర్చువల్ ప్రతిరూప సాంకేతిక నైపుణ్యాల సహాయంతో వాహనాల రూపకల్పన, అభివృద్ధి ప్రక్రియ మరింత మెరుగుపడనుందని ఒలెక్ట్రా వెల్లడించింది. ఈ భాగస్వామ్యంతో ఆధునిక సాంకేతికత ఆధారంగా నూతన నమూనాల విద్యుత్ బస్సులను రూపొందించే అవకాశాలు పెరుగుతాయని, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులను అందించడంలో ఇది కీలకంగా మారనుందని సంస్థ అభిప్రాయపడింది.




# ఇషాన్‌పై సంజూ ఆసక్తికర వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**




భారత క్రికెట్ జట్టులో స్థానం కోసం ఉన్న తీవ్ర పోటీపై వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన సహచర ఆటగాడు ఇషాన్ కిషన్ నుంచి గట్టి పోటీ ఎదురైందని ఆయన అంగీకరించాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనలతో ఇషాన్ తిరిగి జట్టులోకి వస్తున్నాడని ముందే గ్రహించానని సంజూ వెల్లడించాడు ఇటీవల జరిగిన ఇరవై ఓవర్ల ప్రపంచకప్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను సంజూ గుర్తుచేసుకున్నాడు. ఆ టోర్నీలో ఇషాన్ కిషన్ మళ్లీ జట్టులోకి రావడం, కొన్ని మ్యాచ్‌ల్లో తన స్థానంలో అవకాశం పొందడం గురించి ఆయన మనసు విప్పి మాట్లాడాడు. ప్రారంభ మ్యాచ్‌ల్లో తాను ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయానని, అదే సమయంలో ఇషాన్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడని తెలిపాడు ఒక సంభాషణ కార్యక్రమంలో మాట్లాడిన సంజూ శాంసన్, “ఇషాన్ కిషన్ దేశవాళీ పోటీల్లో అద్భుతంగా ఆడాడు. ఝార్ఖండ్ జట్టుకు టైటిల్ అందించాడు. అతను మళ్లీ జట్టులోకి రావడానికి చాలా కష్టపడ్డాడు. అతను పరుగులు చేయడం ప్రారంభించినప్పుడే నా స్థానం కోసం వస్తున్నాడని అర్థమైంది” అని చెప్పాడు తిరువనంతపురంలో ఇషాన్ కిషన్ సెంచరీ చేసిన మ్యాచ్‌ను గుర్తుచేసుకుంటూ సంజూ మరింత భావోద్వేగంగా స్పందించాడు. “ఆ సెంచరీ చూసిన తర్వాత నా మనసులో ‘ఇప్పుడు ఈ స్థానం అతనికే ఇవ్వాలి, అతడే ఎక్కువ అర్హుడు’ అనిపించింది. నాకు అవకాశాలు వచ్చినా సరిగా వినియోగించుకోలేకపోయాను. కానీ అతను అద్భుత ఫామ్‌లో ఉండి ప్రతిదీ సరిగ్గా చేశాడు” అని వెల్లడించాడు. అయితే ఈ పోటీ భారత జట్టుకు ఎంతో ఉపయోగపడిందని సంజూ పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ముగ్గురూ అర్ధ సెంచరీలతో చెలరేగి భారత జట్టుకు మూడోసారి ఇరవై ఓవర్ల ప్రపంచకప్ అందించడంలో కీలక పాత్ర పోషించారు.

# టైటిల్ లక్ష్యంగా దక్షిణాఫ్రికా జట్టు

**వేద న్యూస్ డెస్క్:**




మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తుండడంతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు బలమైన జట్టును ప్రకటించింది. గత సీజన్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకున్న సఫారీ జట్టు.. ఈసారి ఎలాగైనా ప్రపంచకప్ టైటిల్ సాధించాలని పట్టుదలగా ఉంది. అనుభవజ్ఞురాలైన లారా వొల్వార్డ్ నాయకత్వంలో ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో పలు కీలక ఆటగాళ్లకు చోటు కల్పించారు. ముఖ్యంగా సీనియర్ పేసర్ షబ్నిం ఇస్మాయిల్ మళ్లీ జట్టులోకి రావడం దక్షిణాఫ్రికాకు పెద్ద బలంగా మారింది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆమె.. ప్రపంచకప్ కోసం తన నిర్ణయాన్ని మార్చుకుని తిరిగి జట్టులో చేరింది. దీంతో సఫారీ జట్టు బౌలింగ్ దళానికి మరింత పదును వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా.. చివర్లో తడబడి టైటిల్ కోల్పోయింది. ఈసారి ఆ తప్పిదం పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతోంది. కెప్టెన్ లారా వొల్వార్డ్ అనుభవంతో పాటు యువ ఆటగాళ్ల జోష్ జట్టుకు అదనపు బలంగా మారనుంది. టాప్ ఆర్డర్‌లో తజ్మిన్ బ్రిట్స్, అనెరీ డెర్క్‌సెన్, సునే లుస్‌లపై భారీ ఆశలు పెట్టుకుంది జట్టు యాజమాన్యం. మరోవైపు మరిజాన్ కాప్, నడినే డీక్లెర్క్, చొలే ట్రయాన్ వంటి ఆల్‌రౌండర్లు జట్టుకు సమతూకాన్ని తీసుకురానున్నారు. అండర్-19 జట్టు కెప్టెన్ కైలా రెయ్‌నకే తొలిసారి సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవడం విశేషం. యువ ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూనే అనుభవజ్ఞులను కూడా కొనసాగించడం ద్వారా దక్షిణాఫ్రికా సమతూకమైన జట్టును సిద్ధం చేసింది. ఇంగ్లండ్ వేదికగా జరగనున్న ఈ ప్రపంచకప్‌లో షబ్నిం ఇస్మాయిల్, మరిజాన్ కాప్, డాన్ వాన్ నీకెర్క్, అయబొంగ ఖాకా కలిసి బలమైన పేస్ దాడితో ప్రత్యర్థులకు సవాల్ విసరనున్నారు.

దక్షిణాఫ్రికా జట్టు:

లారా వొల్వార్డ్ (కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, నడినే డీక్లెర్క్, అనెరీ డెర్క్‌సెన్, సినాలో జఫ్తా, మరిజాన్ కాప్, సునే లుస్, కరాబో మెసో, నొనుకులులెకో మలబా, కైలా రెయ్‌నకే, తుమి సెఖునే, చొలే ట్రయాన్, డాన్ వాన్ నీకెర్క్, షబ్నిం ఇస్మాయిల్, అయబొంగ ఖాకా.

# యూరప్ క్రికెట్‌లో ద్రవిడ్ కొత్త ప్రయాణం

**వేద న్యూస్ డెస్క్:**



భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ యూరప్ క్రికెట్ రంగంలోకి అడుగుపెట్టారు. యూరప్ ఇరవై ఓవర్ల ప్రీమియర్ లీగ్‌లో భాగంగా “డబ్లిన్ గార్డియన్స్” జట్టును ఆయన సొంతం చేసుకున్నారు. యూరప్‌లో క్రికెట్‌ను మరింత అభివృద్ధి చేయడం, యువ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ ప్రాజెక్టులో భాగమైనట్లు ద్రవిడ్ తెలిపారు. ఈ పరిణామం యూరప్ క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. డబ్లిన్ గార్డియన్స్ జట్టుకు భారత స్టార్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ సారథ్యం వహించనున్నారు. అశ్విన్ అనుభవం జట్టుకు బలంగా మారుతుందని యాజమాన్యం భావిస్తోంది. ఈ లీగ్‌లో డబ్లిన్ జట్టు బెల్ఫాస్ట్, ఎడిన్‌బరో, గ్లాస్గో, రోటర్‌డామ్, ఆమ్‌స్టర్‌డామ్ జట్లతో తలపడనుంది. ప్రారంభ కార్యక్రమంలో పలువురు మాజీ క్రికెట్ దిగ్గజాలు పాల్గొని సందడి చేశారు. గ్లాస్గో జట్టు తరఫున విపుల్ అగర్వాల్, రోటర్‌డామ్ ప్రతినిధులుగా జోంటీ రోడ్స్, మధుకర్ శ్రీ హాజరయ్యారు. అలాగే లీగ్ సహ వ్యవస్థాపకులు అభిషేక్ బచ్చన్, సౌరవ్ బానర్జీ, ప్రియాంక కౌల్, ధీరజ్ మల్హోత్రా కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

# ఫ్రెంచ్ ఓపెన్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీలు

**వేద న్యూస్ డెస్క్:**



ప్రపంచ టెన్నిస్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ ప్రారంభానికి సమయం దగ్గరపడుతోంది. మరో ఆరు రోజుల్లో ప్రారంభం కానున్న ఈ మట్టికోర్టు సమరానికి నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీలను ప్రకటించారు. మాజీ ఛాంపియన్ స్టాన్ వావ్రింకా, ఫ్రాన్స్‌కు చెందిన సీనియర్ ఆటగాడు గేల్ మొన్‌ఫిల్స్‌లకు ప్రత్యేక ఆహ్వానం అందించారు. మహిళల విభాగంలోనూ పలువురు యువ క్రీడాకారిణులకు అవకాశం కల్పించారు. స్విట్జర్లాండ్‌కు చెందిన స్టాన్ వావ్రింకా ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో వెనుకబడినప్పటికీ, ఫ్రెంచ్ ఓపెన్‌లో అతని ప్రదర్శనలు ఇప్పటికీ అభిమానులకు గుర్తుండేలా ఉన్నాయి. 2015లో క్వార్టర్ ఫైనల్లో రోజర్ ఫెదరర్‌ను ఓడించిన వావ్రింకా, అనంతరం ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌ను చిత్తు చేసి టైటిల్ గెలుచుకున్నాడు. అదే జోష్‌తో మరోసారి మట్టికోర్టులో తన సత్తా చాటాలని చూస్తున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన గేల్ మొన్‌ఫిల్స్ కూడా అభిమానుల మద్దతు ఉన్న ఆటగాడిగా పేరొందాడు.  ఈసారి టోర్నీలో అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య పోటీ మరింత ఉత్కంఠభరితంగా ఉండనుంది. పురుషుల విభాగంలో జనిక్ సిన్నర్, అలెగ్జాండర్ జ్వెరెవ్, నొవాక్ జకోవిచ్, ఫెలిక్స్ ఆగర్ అలియాసిమ్ టైటిల్ కోసం పోటీ పడనుండగా.. మహిళల విభాగంలో ఇగా స్వియాటెక్, ఎలెనా రిబాకినా ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. మే 18 నుంచి జూన్ 7 వరకు జరిగే ఈ ప్రతిష్టాత్మక టోర్నీ కోసం ప్రపంచవ్యాప్తంగా టెన్నిస్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

వేద న్యూస్

బుధవారం మే 13, 2026

# మీనాక్షికి వరుస అవకాశాలు

వేద న్యూస్ డెస్క్:



తెలుగు సినీ పరిశ్రమలో కథానాయికల ప్రయాణం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పడం కష్టం. ఒక విజయం వస్తే అవకాశాలు వరుసగా వస్తుంటాయి. అయితే ఒకే నిర్మాణ సంస్థలో వరుసగా అవకాశాలు దక్కడం మాత్రం చాలా అరుదుగా జరుగుతుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఈ అరుదైన గుర్తింపును అందుకుంటోంది నటి మీనాక్షి చౌదరి. హారిక హాసిని, సితార సంస్థలకు ఆమె ఇప్పుడు అత్యంత నమ్మకమైన కథానాయికగా మారినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. మీనాక్షి చౌదరి ప్రయాణం సితార సంస్థతో ప్రత్యేకంగా కొనసాగుతోంది. ఇప్పటికే ఈ సంస్థ నిర్మించిన చిత్రాల్లో దుల్కర్ సల్మాన్ సరసన 'లక్కీ భాస్కర్', నవీన్ పోలిశెట్టి జోడీగా 'అనగనగా ఒక రాజు' చిత్రాల్లో నటించింది. అలాగే హారిక హాసిని నిర్మాణంలో మహేష్ బాబు హీరోగా వచ్చిన 'గుంటూరు కారం' చిత్రంలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. సాధారణంగా ఒక సినిమాలో నటించిన తర్వాత కథానాయికలు ఇతర నిర్మాణ సంస్థలకు వెళ్లడం సహజం. కానీ మీనాక్షి విషయంలో మాత్రం నిర్మాత నాగవంశీ బృందం పూర్తి నమ్మకంతో వరుస అవకాశాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెకు వరుసగా చిత్రాలు ఆఫర్ చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, సితార సంస్థలో మీనాక్షి తన ఐదో చిత్రాన్ని కూడా ఖరారు చేసుకున్నట్లు తెలుస్తోంది. తమిళ స్టార్ హీరో ఐ కార్తీ, దర్శకుడు కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రంలో మీనాక్షిని కథానాయికగా ఎంపిక చేసినట్లు సమాచారం. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సితార సంస్థకు విజయాలు అందించిన కళ్యాణ్ శంకర్, ఇప్పుడు మరో వినోదాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో నిశ్శబ్దంగా జరిగినట్లు సమాచారం. కేవలం వెండితెరపైనే కాకుండా డిజిటల్ వేదికలపై కూడా మీనాక్షి దూసుకుపోతోంది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా సితార సంస్థ నిర్మిస్తున్న ఒక వెబ్ ధారావాహికలో కూడా ఆమె నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకే నిర్మాణ సంస్థలో ఐదు ప్రాజెక్టులు దక్కడం అంటే ఆ సంస్థకు ఆమె ఎంత అదృష్టకరమైన కథానాయికగా మారిందో అర్థమవుతోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో కార్తీ సినిమా తో పాటు నాగచైతన్య నటిస్తున్న 'వృషకర్మ', అలాగే హిందీలో 'భాగమ్ భాగ్ ఫ్ట్ర' వంటి భారీ చిత్రాలు ఉన్నాయి. అందం మాత్రమే కాకుండా నటనలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ హర్యానా భామ, రాబోయే రోజుల్లో టాలీవుడ్ అగ్ర కథానాయికల జాబితాలో చోటు దక్కించుకోవడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# 'దృశ్యం 3' ఈసారి నేరుగా డబ్బింగ్ రూపంలోనే

వేద న్యూస్ డెస్క్:




మలయాళ సూపర్ హిట్ 'దృశ్యం' చిత్రాలు తెలుగులో వెంకటేష్ హీరోగా రీమేక్ అయిన సంగతి తెలిసిందే. అయితే 'దృశ్యం ఙ' విషయంలో మాత్రం ఈసారి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సోమవారం విడుదలైన తెలుగు ప్రచార చిత్రంతో దీనిపై స్పష్టత వచ్చింది. ఈసారి తెలుగులో మళ్లీ రీమేక్ చేయకుండా, మలయాళ అసలు చిత్రాన్నే నేరుగా తెలుగులోకి డబ్బింగ్ చేసి విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. దీంతో జార్జ్ కుట్టి పాత్రలో మోహన్ లాల్ నటనను తెలుగు ప్రేక్షకులు నేరుగా వెండితెరపై ఆస్వాదించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రం ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఉత్కంఠ, భావోద్వేగాలు, ఆసక్తికర మలుపులతో ఈసారి కథ మరింత బలంగా ఉండబోతుందని సంకేతాలు ఇచ్చింది ఈ మూడో భాగం కథపై దర్శకుడు జీతూ జోసెఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొదటి రెండు భాగాల్లో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి జార్జ్ కుట్టికి శత్రువు ఎవరో తెలుసని, కానీ ఈసారి తనను ఎవరు వెంబడిస్తున్నారో, ప్రమాదం ఎటు నుంచి వస్తుందో కూడా తెలియని భయంకర పరిస్థితుల్లో అతడు చిక్కుకుంటాడని తెలిపారు. ఈ "తెలియని శత్రువు" అంశమే సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథలో వచ్చే మలుపులు, జార్జ్ కుట్టి ఎదుర్కొనే మానసిక ఒత్తిడి ఈసారి మరింత ఉత్కంఠను పెంచనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'దృశ్యం' సిరీస్ ఉత్కంఠభరిత చిత్రాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడంతో, మూడో భాగంపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మోహన్ లాల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని మే 21న భారీ స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో ఒకేసారి ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఉత్కంఠభరిత చిత్రాలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ఈ సిరీస్, మూడో భాగంతో ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# తారక్ గ్లింప్స్‌కు కౌంట్‌డౌన్




వేద న్యూస్ డెస్క్:

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఎన్టీఆర్-నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ చిత్రంపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ ప్రపంచాన్ని సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన తొలి చూపును తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో మే 20న అభిమానులకు భారీ కానుక ఖాయమని అందరూ భావించారు. అయితే తాజా సమాచారం ప్రకారం అభిమానుల ఉత్సాహాన్ని మరింత పెంచేలా ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను విడుదల చేయాలని మేకర్స్ యోచిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ తొలి చూపు విడుదలయ్యే అవకాశముందని సమాచారం. అర్ధరాత్రి నుంచే సామాజిక మాధ్యమాల్లో తారక్ అభిమానుల సందడి మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్నచిన్న లీక్స్, సెట్స్ ఫొటోలు అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచాయి. ఇప్పుడు తొలి చూపుతో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మే 18న రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటంతో సామాజిక మాధ్యమాల్లో ఇప్పటికే మెగా అభిమానుల సందడి మొదలైంది. ఇక దానికి మరుసటి రోజే తారక్ గ్లింప్స్ రావడంతో మెగా-నందమూరి అభిమానుల మధ్య సామాజిక మాధ్యమాల పోరు మరింత ఉత్కంఠగా మారనుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ భారీ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తోంది. దేశవ్యాప్తంగా విడుదలయ్యే ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో హీరో ఎలివేషన్స్ ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు అదే స్థాయి ట్రీట్ తారక్‌కు దక్కబోతుండటంతో అభిమానుల అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా 'ఆర్ఆర్ఆర్' తర్వాత తారక్ నుంచి వస్తున్న ఈ భారీ సోలో ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇక మే 19 అర్ధరాత్రి విడుదలయ్యే గ్లింప్స్‌లో తారక్ లుక్, పాత్ర, సినిమా నేపథ్యంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. "అర్ధరాత్రి ఉదయించే సూర్యుడిలా తారక్ విధ్వంసం మొదలవుతుంది" అంటూ ఇప్పటికే అభిమానులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ చేస్తున్నారు.

# బాలయ్యకు వివేక్ ఆత్రేయ కథ?

వేద న్యూస్ డెస్క్:



ప్రయోగాత్మక చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వివేక్ ఆత్రేయ, ఇప్పుడు ఏకంగా నందమూరి బాలకృష్ణను దర్శకత్వం వహించే అవకాశాన్ని దక్కించుకున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ సినిమాలో బాలయ్య మరోసారి ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారనే వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. బాలయ్య శరీర భాషకు తగ్గట్టుగా ఒక పవర్‌ఫుల్ కమర్షియల్ కథను వివేక్ ఆత్రేయ సిద్ధం చేశారని సమాచారం. గతంలో బాలకృష్ణ దాదాపు 18 చిత్రాల్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ పాత్రల్లో నటించి అభిమానులను మెప్పించారు. ఇప్పుడు ఈ కొత్త చిత్రం కూడా ఆ జాబితాలో మరో ప్రత్యేక చిత్రంగా నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి 'కురుక్షేత్రం' అనే శక్తివంతమైన పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ పేరు బయటకు రావడంతోనే నందమూరి అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక పనులు వేగంగా జరుగుతున్నాయని తెలుస్తోంది. దర్శకుడు వివేక్ ఆత్రేయ, బాలకృష్ణలోని మాస్ కోణాన్ని కొత్త తరహాలో ఆవిష్కరించబోతున్నారని, కథాంశం కూడా చాలా భిన్నంగా ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అన్ని అనుకూలిస్తే ఈ ఏడాది చివర్లోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం. సాధారణంగా బాలకృష్ణ సినిమాలో ద్విపాత్రాభినయం ఉంటే అందులో ఒక పాత్ర మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా, మరొకటి భావోద్వేగాలకు దగ్గరగా ఉండేలా రూపొందిస్తారని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక వివేక్ ఆత్రేయ చిత్రాల్లో కనిపించే తెలివైన కథనం, భావోద్వేగాల మేళవింపు బాలయ్య శైలికి జత కలిస్తే ఫలితం మరో స్థాయిలో ఉంటుందని సినీ అభిమానులు భావిస్తున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ చేతిలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయ్యాక ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని సమాచారం. మొత్తంగా చూస్తే, తన తదుపరి చిత్రంతో బాలయ్య అభిమానులకు మరోసారి ద్విగుణీకృత వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతున్నట్లు టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది.

# కష్టాలను జయించిన అంజలి

వేద న్యూస్ డెస్క్:

తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో తన సహజ నటనతో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కథానాయిక అంజలి.. ఇప్పుడు మరోసారి తన జీవిత ప్రయాణం గురించి చేసిన వ్యాఖ్యలతో చర్చనీయాంశంగా మారారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ అందాల తార.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్, వ్యక్తిగత జీవితం, ఎదుర్కొన్న కష్టాలు, మానసిక ఒత్తిడులు, తిరిగి నిలబడిన విధానం గురించి భావోద్వేగంగా మాట్లాడారు. ఇప్పటికే యాభైకి పైగా చిత్రాల్లో నటించిన అంజలి.. తన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదని తెలిపారు. ముఖ్యంగా 'గీతాంజలి' సినిమా గురించి మాట్లాడుతూ.. భయానక కథాంశంతో తెరకెక్కిన ఆ చిత్రంలో కథానాయిక ప్రధాన పాత్ర పోషించడం తనకు ఎంతో ప్రత్యేక అనుభవమని చెప్పారు. అలాంటి పాత్రలు నటిగా తనను మరింత మెరుగుపరిచాయని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనను తాను సానుకూలంగానే స్వీకరిస్తానని ఆ సినిమా విజయంతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యానని పేర్కొన్నారు. అయితే కెరీర్ మంచి స్థాయిలో కొనసాగుతున్న సమయంలో వ్యక్తిగతంగా, ఆర్థికంగా తీవ్ర సమస్యలు ఎదురయ్యాయని అంజలి చెప్పారు. కుటుంబ సభ్యులు, దర్శకుడు కలంజియంతో సహా కొందరి చర్యల వల్ల తాను ఆర్థిక మోసాలకు గురయ్యానని ఆరోపించారు. ఈ వ్యవహారాలు ప్రస్తుతం న్యాయస్థానంలో కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆ సమస్యల ప్రభావంతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యానని అంజలి తెలిపారు. కొంతకాలం పూర్తిగా ఒంటరిగా ఉండాలని భావించి.. స్వచ్ఛందంగానే సినీ పరిశ్రమకు దూరంగా ఉన్నానని చెప్పారు. అయితే చాలామంది తాను కనిపించకుండా పోయానని ప్రచారం చేశారని, కానీ తాను ఎక్కడికీ వెళ్లలేదని స్పష్టం చేశారు. తన కుటుంబ సభ్యులు, స్నేహితులకు తాను ఎక్కడ ఉన్నానో తెలుసని తెలిపారు 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' విజయానంతరం వచ్చిన గుర్తింపును తాను ఆస్వాదించానని.. కానీ అదే సమయంలో ఎదురైన సమస్యలు జీవితాన్ని కఠినంగా మార్చాయని అంజలి పేర్కొన్నారు. అయినప్పటికీ ఆ కష్టాల నుంచి బయటపడటం, మళ్లీ కెరీర్‌పై దృష్టి పెట్టడం తన జీవితంలో పెద్ద విజయమని భావిస్తున్నట్లు చెప్పారు. ఎసినీ పరిశ్రమలో తనకు ప్రత్యేకంగా ఎలాంటి అండదండలు లేకపోయినా.. కొంతమంది నిజమైన స్నేహితులు ఎప్పుడూ తనకు అండగా నిలిచారని తెలిపారు. వారు ఇచ్చిన ధైర్యం వల్లే మళ్లీ నిలబడగలిగానని చెప్పారు. ప్రస్తుతం పూర్తి ఆత్మవిశ్వాసంతో మంచి కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నానని వెల్లడించారు. ఇప్పుడైతే గతాన్ని గుర్తుచేసుకుని బాధపడకుండా.. ప్రతి అనుభవాన్ని ఓ పాఠంగా తీసుకుంటున్నానని అంజలి తెలిపారు. జీవితంలో ఎంత పెద్ద సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటే తప్పకుండా గెలవొచ్చని ఆమె చెప్పిన మాటలు అభిమానులను ఆలోచింపజేస్తున్నాయి.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073